


రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో మంగళవారం పున్నమి హారతి ఇచ్చారు. పౌర్ణమి సందర్భంగా గోదావరి మాతకు హారతిచ్చినట్టు అర్చకులు తెలిపారు. ఆ హారతి చూద్దామని ఎక్కడో మహారాష్ట్ర నుంచి వచ్చిన యాత్రికులకు కనీసం అవకాశం కల్పించలేదు. దీంతో గేటు వద్ద నిలబడి ఇలా తిలకించారు.
- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



వైద్య సిబ్బందితో కలిసి జిల్లా ఆసుపత్రి ఆవరణ పరిశీలించి ల్యాబ్‌ను తనిఖీ చేసి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కీర్తి చేకూరి

వైద్యంపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి కథనంతో కలెక్టర్ కీర్తి చేకూరి కదిలారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవల నాణ్యతపై ఆరా తీశారు. పలు వార్డులు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. టీబీ విభాగం పనితీరుపై ఆరా తీశారు. మందుల నిల్వలు, ల్యాబ్ పరీక్షల తీరుతెన్నులు, ఓపీ రిజిస్ట్రేషన్ తదితర వివరాలు తెలుసుకున్నారు. రోగులకు వైద్యసేవలందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. వైద్య పరీక్షలకు బయటకు వెళ్లే పరిస్థితి రాకూడదని, అన్ని సౌకర్యాలు ప్రభుత్వాసుపత్రిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఖాళీగా ఉన్న వైద్యాధికారులు పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, ఆర్ఎంవో సుబ్బారావు, వైద్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారాజ్యమే!

జిల్లాలో సారా కోరలు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సారా యథేచ్ఛగా తయారవుతోంది.. విచ్చల విడిగా లభ్యమవుతోంది.. అయినా అధికారులు చూస్తూ ఊరుకోవడం తప్ప ఏం చేయలేకపోతున్నారు. ఎక్కడ ఏం జరుగుతుందో ఎక్సయిజ్ సిబ్బందికి తెలిసినా మామూళ్ల మత్తులో జోగు తూ కళ్లు మూసుకుంటున్నారు. టార్గెట్ల మేరకు కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం నిర్వహించిన సమీక్షలో కూడా ఎక్సయిజ్ అధికారులు జిల్లాలో 1029 సారా కేసులు నమోదు చేసి 1079 మందిని రిమాండ్‌కు పంపామని చెప్పడం గమనార్హం. అంతే కాకుండా 13,500 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 3,97,240 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు చెప్పారు.40,324 కేజీల బెల్లం స్వాధీ నం చేసుకుని 19 మంది బెల్లం విక్రయ దా రులపై కేసులు నమోదు చేశామన్నారు. సారా తయారీ కాస్త తగ్గినట్టు కనిపించినా..ఇంకా కొనసాగుతూనే ఉంది.

సారా తయారయ్యేదిక్కడే!

జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలో సారా లభ్యత పెరిగింది. దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు సమీప ప్రాంతాలు, వెలుగుబంద, శ్రీరాం పురం,దివాన్‌చెరువు, కానవరం, రఘునాథపురం, పుణ్యక్షేత్రం, శ్రీకృష్ణపట్నం, చక్రద్వారబంధం, గోకవరం మండలం తిరుమలాయపాలెం, మల్ల వరం, కామరాజుపేట, గంగంపాలెం, రంప ఎర్రంపాలెం తదితర ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలు ఉన్నాయి. గోపాలపురం మండలం బీ మోలు, సాగిపాడు, చాగల్లు మండలం చిక్కాల, దేవరపల్లి మండలం లక్ష్మీపురం, తాళ్లపూడి మం డలం తుపాకులగూడెం, నల్లజర్ల తదితర ప్రాం తాల్లో సారా ఇబ్బడిముబ్బడిగా తయారు చేస్తు న్నారు.రాజమహేంద్రవరంలో సీతంపేట, అప్సర థియేటర్ శ్యామలాంబ గుడి ఏరియా, నారాయ ణపురం వాంబే కాలనీ, ఆవ వాంబే కాలనీ, ధవ ళేశ్వరం ఐవోసీఎల్ కాలనీ, కాతేరు, ఆనంద్‌నగర్, క్వారీ మార్కెట్ ఏరియా, సంతోష్ నగర్, కొంత మూరు శివారు, సుబ్బారావునగర్, సీటీఆర్ఐ పనసచెట్టు ఏరియా, లాలాచెరువు లోపల ప్రాం తాల్లో, రైల్వేస్టేషన్ ప్రాంతం తదితర చోట్ల సారా లభ్యమవుతోంది. గతంలో వెంకటనగరం సారా తయారీకి అడ్డాగా ఉండేది. కానీ తర్వాత తయా రీదారుల్లో అంతర్గత గొడవల వల్ల కేసుల్లో ఇరుక్కోవడంతో తయారీ తగ్గింది.బయట ప్రాం తాల నుంచి వచ్చిన వాళ్లు బ్యాచీలుగా తయార య్యారు. వెంకట నగరం దాటి ఎగువ లంకల్లో సీతానగరం వరకూ సారా కాస్తున్నారు. వరద ల్లో మునగనిలంకలు సారా తయారీకి అడ్డాగా మారిపోయాయి.

నైవోదయం

సారా తయారీ దారులు, విక్రయదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడం ద్వారా శాశ్వతంగా సారా తయారీకి దూరం చేయాలనేది నవోదయం 2.0 ముఖ్యోద్దేశం. కానీ కేసులు బనాయిస్తున్నామని గర్వంగా ప్రకటిస్తున్న ఎక్సైజ్ శాఖ.. ఎంత మంది జీవితాల్లో నవోదయం తీసుకొచ్చిందో చెప్పలేని స్థితిలో ఉండడం గమనార్హం.

కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టినా..

కూటమి ప్రభుత్వం సారా మహమ్మారిని నిర్మూలించాలని గట్టిగా నిర్ణయించుకొంది. సారా నిర్మూలనే ధ్యేయంగా నవోదయం 2.0 పేరుతో ఎక్సయిజ్ శాఖలో ఒక విభాగాన్నే ఏర్పాటు చేశారు. ఎక్సయిజ్, పోలీసుల ఉదాసీనత ప్రభుత్వ ఉద్దేశాన్ని వెనక్కు నెడుతోంది. దీంతో జిల్లాలో సారా ఏరులై పారుతోంది. ఎక్కడో గ్రామాల్లో దొరికే నాటు సారా ఇప్పుడు సిటీల్లో కూడా పూటుగా లభ్యమవుతోంది. దీంతో నవోదయం 2.0 నీరుగారిపోతుండగా.. ఎక్సైజ్ అధికారులు నవోదయం అర్థాన్నే మార్చేసి కేసు లతో సంబుర పడుతున్నారు. ఎక్సయిజ్, పోలీస్ శాఖలోని ఇంటి దొంగలు వారాల మామ్మూళ్లు పెట్టుకోవడంతో కేసులు తప్ప సారా వ్యాపారుల జీవితాల్లో మంచి మార్పు లేకుండా పోయింది. పోలీస్ శాఖ పూర్తిగా కాడి వదిలేసి చోద్యం చూస్తుండడం కొసమెరుపు. సారా నిర్మూలనకు గట్టిగా పట్టుపడుతున్నామని అధికారులు చెబుతుండడం తప్ప చర్యలు శూన్యం.

పెద్ద సార్లు ఉన్నా..

నవోదయం 2.0కి అమలుకు అసిస్టెంట్ కమి షనర్ స్థాయి అధికారిని జిల్లాలో ప్రభుత్వం నియమించింది. కొందరు సీఐలనూ ప్రత్యేకించారు. సిబ్బందిని నియమించారు. కానీ ఎవరికి వారు యథాలాపంగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో నవోదయం ఉద్దేశం నిర్వీర్యమ వుతోంది. జిల్లాలో 19 మండలాల్లో 19 మండల స్థాయి కమిటీలను , 240 గ్రామస్థాయి కమిటీలను నియమిం చామని, 313 అవగా హన సదస్సులు నిర్వహిం చామని, 63 మంది దత్తత అధికారులు ఉన్నా రని ఎక్సైజ్ వారు వల్లెవేస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితుల్లో ఏ మేరకు మార్పు వచ్చిందో గమనిస్తే రాజమహేంద్రవరం నగరంలో సైతం ఏ సమయంలోనైనా సారా బాటిల్ దొరికే స్థా యికి పరిస్థితి చేజారింది. కొన్ని ప్రాంతాల్లో అధికారులను సైతం బెదిరించే స్థాయికి తయారీ, విక్రయదారులు చేరుకున్నారు.

- యథేచ్ఛగా తయారీ..అమ్మకాలు
- మారుమూల ప్రాంతాలే కేంద్రాలు
- పలు గ్రామాల్లో కుటీర పరిశ్రమగా
- కమిటీలు అంటున్న ఎక్సయిజ్
- చోద్యం చూస్తున్న పోలీస్
- సిబ్బందికి వారం మామూళ్లు
- తనిఖీల సమాచారం చేరవేత
- నెరవేరని నవోదయం లక్ష్యం

బాటిళ్లలో సారా

సారా వ్యాపారులు మారారు.. గతంలో సారా ప్యాకెట్లలో అమ్మకం జరిగేది. ఇప్పుడు 5, 10 లీటర్ల పెద్ద కవర్లలో సారా తీసుకొచ్చి దుకాణా లకు చేరుస్తున్నారు. అక్కడ పావు, అర, లీటరు బాటిళ్లలో నింపి అమ్మకాలు జరుపుతున్నారు. గతంలో పుల్లల పొయ్యి పెట్టి ఆ బట్టీల్లో సారా కాయడం జరిగేది. ఇప్పుడు గ్యాస్ సిలిండర్లను.. స్టవ్‌లను వినియోగించి సారా కాస్తున్నారు.

వారం..వారం మామూళ్లు..

సారా దుకాణాల వాళ్లు ఎక్సైజ్, పోలీసులకు గతంలో నెలవారీ మామ్మూళ్లు ఇవ్వడం పరి పాటిగా ఉండేది. కానీ ఇప్పుడు వారాంతపు పేమెంట్లు పెట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సారా తయారీ దారులు ఎక్కడికి సరుకును సరఫరా చేస్తున్నారో డిపార్ట్‌మెంటు వారికి చెబితే వీరు వెళ్లి డబ్బులు వసూలు చేసుకుంటు న్నారని సమాచా రం. అందువల్ల ఆకస్మిక, సాధారణ దాడుల విషయం ముందుగానే కొందరు ఇంటి దొంగలు ఉప్పందిస్తుండడంతో సారా తయారీ, విక్రయదారులు అప్పటికి తాత్కాలికంగా సర్దుకుంటున్నారు. ఒకప్పుడు పెద్ద డ్రమ్ములు, ఎరువులు (పిండి), బెల్లం వంటి వాటిపై నిఘా ఉండేది. పెద్ద సంఖ్యలో ఎవరైనా కొనుగోలు చేస్తే ఎక్సయిజ్‌కి సమాచారం వెళ్లేది. కానీ ఇప్పుడు డబ్బుల మత్తులో అవన్నీ పక్కకుపోయాయి.

సమాచారం ఉంటే డయల్ 14405



సారా నిర్మూలనకు చర్యలు చేపడుతున్నాం.ఎక్కడ ఎవరు సారా తయారు చేసినా,అమ్మినా, రవాణా చేసినా 14405కు కాల్ చేసి ఫిర్యాదు చేయా లి.ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంటాయి. - కీర్తి చేకూరి, కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్, చిత్రంలో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, తూర్పు డీఆర్‌వో సీతారామమూర్తి తదితరులు

కూటమి వర్సెస్ వైసీపీ

వాడివేడిగా ఉమ్మడి జిల్లా జడ్పీ సమావేశం

- వైద్య కళాశాలల పీపీపీపై రగడ
- రద్దుకు వైసీపీ సభ్యుల డిమాండ్
- ఇరుపక్షాల మధ్య తీవ్ర చర్చ
- చివరకు తీర్మానం ఆమోదం
- జీఎస్టీపై తీర్మానానికి పట్టు
- ఆమోదించని వైసీపీ
- జడ్పీలో తలపడిన సభ్యులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని రద్దు చేయాలంటూ వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ అంశంపై ఇప్పటికే రాష్ట్ర శాసన సభ, శాసన మండలిలో చర్చ జరిగి ప్రభుత్వం వివరణ ఇచ్చిన దృష్ట్యా జడ్పీ సమావేశంలో చర్చ అవసరం లేదు. జీఎస్టీ తగ్గించడంపై ప్రధాని మోదీ, జీఎస్టీ మండలికి అభినందనలు తెలపాలి అంటూ అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించారు. అయితే వైసీపీ సభ్యులు వ్యతిరేకించారు. ఇలా ఇరు పక్షాల వాదోపవాదాలతో కాకినాడలోని జీఎంసీ బాలయోగి జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయాలని సభ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయమై శాసనసభ, శాసనమండలిలో చర్చ జరిగిందని, ఈ అంశంపై ప్రభుత్వం వివరణ ఇచ్చిన దృష్ట్యా జడ్పీ సమావేశంలో చర్చించాల్సిన అవసరం లేదన్నారు. దీంతో వైసీపీ జడ్పీటీసీ సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ నచ్చచెప్పి వారిని తిరిగి సమావేశానికి హాజరయ్యేలా ఒప్పించారు. వైద్యకళాశాల అంశంపై చర్చకు అనుమతించారు. ఎమ్మెల్సీలు పేరాబత్తుల, సోమువీర్రాజు మాట్లాడుతూ నిధుల కొరతను అధిగమించి వైద్య సేవలను సత్వరం పేదలకు అందుబాటులోకి తెచ్చేందుకు పీపీపీ అవసరమని వివరించారు. తీవ్ర చర్చ అనంతరం వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో అప్పగింత రద్దు చేయాలని జడ్పీ చైర్మన్ ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది. యూరియా కొరత పట్ల సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ పరిస్థితిని సభ్యులకు వివరిస్తూ, 2023తో పోలిస్తే 2025 ఖరీఫ్‌లో 3 వేల మెట్రిక్ టన్నులు అధికంగా యూరియా పంపిణీ చేశామని, పానిక్ పర్చేజెస్ కారణంగా కొరత ఎదురవుతోందని తెలిపారు. ప్రస్తుతం యూరియా బఫర్ స్టాక్ ఉందని, రైతులఅవసరాలకు ఇబ్బంది లేదన్నారు. ఇరిగేషన్ - (మిగతా 7వ పేజీలో)

ఆర్టీసీ దసరా ఆదాయం రూ.40 లక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఆర్టీసీ రూ.40 లక్షల ఆదాయం ఆర్జించింది. మొత్తం 194 బస్సులను వివిధ ప్రాంతాలకు ఆపరేట్ చేయడం ద్వారా ఈ ఆదాయం లభించిందని జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. గోకవరం డిపో నుంచి 34 బస్సులు, కొవ్వూరు డిపో నుంచి 37 బస్సులు, నిడదవోలు డిపో నుంచి 19 బస్సులు, రాజమహేంద్రవరం డిపో నుంచి 104 బస్సులు నడపడం జరిగిందని తెలిపారు. మొత్తం 28,712 మంది ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చడం జరిగిందని, 92 శాతం ఓఆర్ సాధించామని తెలిపారు. స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమల్లో ఉండగానే జిల్లా ఆర్టీసీ ఇంత భారీ స్థాయిలో ఆదాయం సాధించిందన్నారు. అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని అభినందిస్తున్నామన్నారు.



ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో టీడీపీ నాయకులు, పేపరుమిల్లు యూనియన్ కార్మికులు

పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేశాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులకు వేతన ఒప్పందం అమలు కూటమి ప్రభుత్వ విజయమేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. నూతన వేతన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో మిల్లు కార్మిక యూనియన్ నాయకులు మంగళవారం తిలక్ రోడ్డులో కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు.గత వైసీపీ ప్రభుత్వంలో ప్యాకేజీపై ఉన్న శ్రద్ధ కార్మికుల వేతన ఒప్పందంపై చూపించలేదన్నారు. కార్మికుల సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో న్యాయం జరిగేలా మంచి అగ్రిమెంట్ చేయించగలిగామన్నారు. అనంతరం పేపరుమిల్లు కార్మిక నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లకు పైబడి అగ్రిమెంట్ లేక చాలా బాధలు పడ్డామన్నారు. ఎమ్మెల్యే వాసు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్‌లు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అగ్రిమెంట్ చేయించారన్నారు. విజయవాడలో జరిగిన అగ్రిమెంట్‌లో కార్మికులకు రూ.5,800 చొప్పున, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.2,200 చొప్పున జీతం పెంచారని తెలిపారు. మంచి అగ్రిమెంట్ చేసి 4 వేల మంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.ఏలూరులో అగ్రిమెంట్ కాపీ ఇచ్చారని దీనిపై 11 యూనియన్లు సంతకాలు పెట్టాయని తెలిపారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు,వర్రే శ్రీనివాసరావు, పేపరు మిల్లు కార్మిక నాయకులు పాల్గొన్నారు.




అన్నదాతకు.. ధర కోత!

వరి కోతలు ఆరంభంలోనే అష్టకష్టాలు

- మెట్టలో చేతికొస్తున్న పంట
- ఐదు రోజులుగా కోతలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లేవ్
- 11 నుంచి ప్రారంభం
- దళారులకు అమ్మకాలు
- బస్తాకు రూ.370 నష్టం
- ముందస్తు సాగు ఎఫెక్ట్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ముందస్తు సాగుకు అధికారులు చేపట్టిన చర్యలు ఫలించాయి. అప్పుడే వరి కోతలు ఆరంభమైపోయాయి.రైతులు సన్నాల రకం పండిం చాలంటూ అధికారులు ప్రోత్సహించడంతో రైతులు అదేరకం పండించారు. అయితే వాతావరణ ప్రభావం, మరో వైపు వరిపంట కోతకు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తప్పని పరిస్థితుల్లో కోతలు కోస్తున్న రైతులు దళారులకే అమ్ము కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిట్టుబాటు కాక రైతులు లబోదిబోమంటున్నారు. ధాన్యం కొను గోలు కేంద్రాలు ఏర్పాటుకు డిమాండ్ చేస్తున్నారు.

81,971 హెక్టార్లలో సాగు

జిల్లాలో 80,971 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. పంటకాలువల ద్వారా 38,100, బోర్‌వెల్స్ ద్వారా 41,117, వర్షాధారం 1700 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కొవ్వూరు, నిడదవోలు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో రైతుల బోర్ల కింద వరి సాగు చేస్తారు.దీంతో సుమారు 15 రోజుల ముం దుగానే పంట చేతికొస్తుంది. ఈ పరిధిలో రైతులు ఎక్కువ శాతం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాకుండా దళారుల ద్వారా మిల్లర్లకు విక్రయిస్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే సరికే మూడొంతుల పంట అమ్మకాలు జరిగిపోతాయి. ఆయా ప్రాంతాల్లో ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బస్తా రూ.1400లే

గత ఐదు రోజులుగా కోత లు కోస్తున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ కేంద్రాల ద్వారా గ్రేడ్ ఏ రకం 75 కేజీల బస్తా రూ.1791.75, కామన్ రకం రూ.1776.75 కొను గోలు చేస్తామని ప్రభుత్వం చెబుతుంది.అయితే బోర్ల కింద వేసిన పంట కోతలకు రావడం, నిల్వ చేసు కునేందుకు అనుకూల పరిస్థితులు లేకపోవ డంతో వెరసి దళారులకు వరంగా మా రింది. దీంతో దళారులు అడిగిన ధరకే అమ్ము కోవాల్సి వస్తోంది. గతేడాది ఇదే సమయానికి ధాన్యం బస్తా(75 కేజీలు) అదే దళారుల (ప్రైవేటు మిల్లర్లు) రూ.1600 నుంచి రూ.1700 ల వరకు కొనుగోలు చేశారు.ప్రస్తుతం రైతుల పరిస్థి తులను అసరాగా తీసుకొని రూ.1400 కే కొను గోలు చేసి దళారులు సొమ్ములు చేసుకుం టున్నారు. గత సీజను కంటే ప్రస్తుత సీజన్‌లో కాంప్లెక్స్ ఎరువులు సుమారు రూ.200 నుంచి రూ. 250 వరకు పెరిగాయని దీంతో తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే

సహించొద్దు

జిల్లా నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సాధారణ జన జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవద్దని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సర్కిళ్ల వారీగా కేసులపై ఆరా తీశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, అసాంఘిక వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లపై తనిఖీలు, రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. అనుమానితుల వేలిముద్రలను ఎంఎస్‌డీ డివైజ్‌తో చెక్ చేయాలన్నారు. ప్రతి కేసులో సాంకేతిక ఆధారాలు సేకరించడంతో పాటు అందుబాటులో ఉన్న ఆధునిక పద్ధతుల్లో దర్యాప్తులు చేయాలని చెప్పారు. జిల్లాలోని బ్లాక్ స్పాట్లలో డ్రోన్‌లతో పర్యవేక్షణ చేయాలన్నారు.అనంతరం సేఫ్ దీపావళి పోస్టర్లు విడుదల చేశారు. గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్ బీఎం.మురళీ కృష్ణ,ఏవీ సుబ్బరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాలేజ్ బస్ ఆపించి.. కాలువలో దూకేసిన ఇంటర్ విద్యార్థిని..

ఎదురెదురుగా మోటార్ సైకిళ్లు ఢీ.. ఇద్దరి దుర్మరణం

సెల్‌ఫోన్, రూ.500ల కోసం యువకుడి హత్య

7

ఉద్యాన పంటలపై నత్తల దాడి




గంగలకుర్రులో కొబ్బరిచెట్టుని పట్టుకున్న నత్తను చూపిస్తున్న రైతు ఆంజనేయులు.. బెండ మొక్కను పట్టుకున్న నత్త

- కోనసీమలో తొలిసారిగా గంగలకుర్రులో గుర్తింపు
- ఇప్పటికే రూగోస్ తెల్లదోమతో తీవ్రంగా నష్టపోయిన రైతు
- కూరగాయలు, తీగపాదులను తినేస్తున్న నత్తలు
- తెల్లవారేసరికి పంటలపై కనిపించని నత్తలు
- వణికిపోతున్న అన్నదాతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న శాస్త్రవేత్తలు
- ఉప్పుద్రావణంతో పిచికారితో నివారణ సాధ్యం



అంబాజీపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ములిగే నక్కపై తాటిపండు పడినట్టుగా మారింది రైతన్నల పరిస్థితి. గత ఐదేళ్లుగా కొబ్బరితోపాటు ఉద్యాన పంటలను ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగచేసిన రూగోస్ తెల్లదోమ పూర్తిగా నివారణకాకముందే ఆఫ్రికా నత్తలు కోనసీమలోకి ప్రవేశించి కొబ్బరితోపాటు అరటి, బొప్పాయి, కూరగాయల పంటలు, పాదులను పీల్చిపిప్పిచేస్తున్నాయి. దీంతో ఇప్పటికే నష్టాలు ఎదుర్కొంటున్న రైతులు వణికిపోతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామంలో ఈ ఆఫ్రికా నత్తల దాడిని రైతులు చూసి ఆశ్చర్యపోయారు. గంగలకుర్రు గ్రామానికి చెందిన రైతు చిరతపూడి ఆంజనేయులు అదే గ్రామంలో జగ్గన్నతోట సమీపంలో వంగ, బెండ, ఆనప, దొండ, వివిధ రకాల కూరగాయలు సాగుచేస్తున్నాడు. గత రెండు నెలలుగా మొక్కలు, కాయలను పిప్పిచేస్తున్నాయి. దీంతో ఆ రైతు పురుగు, మందులు పిచికారి చేసిన్నప్పటికి ఫలితం లేకపోయింది. అయితే కొన్ని రోజుల తరువాత తెల్లవారుజామున పొలంలోకి వెళ్లి చూడగా ఆ రైతుకు చెట్లను నత్తలు పట్టుకుని కాయలు తినడాన్ని గమనించి ఆశ్చర్యపోయాడు. వీటి వల్ల సుమారు రూ.50వేలకుపైగా నష్టపోయిన్నట్టు రైతు ఆంజనేయులు వివరించాడు.

పార్వతీపురం, నల్లజర్లలో గుర్తింపు

మొన్నటిదాకా విశాఖ, మన్యం జిల్లాలో రైతులను కలవరానికి గురిచేసిన ఈ నత్తలు, తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దేవరపల్లిలో ఆ ఆఫ్రికన్ నత్తళ్లను పంటలపై దాడిచేయడాన్ని ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇప్పుడు ఈ నత్తలు కోనసీమ జిల్లాలోకి ప్రవేశించాయి. కేరళ నుంచి వక్కమొక్కలను ఆ ప్రాంతానికి తీసుకురావడంతో ఈ నత్తలు వచ్చినట్టు గుర్తించారు. ప్రస్తుతం కోనసీమలోని అంబాజీపేట మండలం గంగలకుర్రు జగ్గన్నతోట ప్రాంతంలో ఈ నత్తలు ఉండడాన్ని గుర్తించారు. సూర్యరశ్మికి ముందే నత్తలు కనిపించకుండా వెళ్లిపోతున్నాయి.

ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం

ఉద్యాన, వ్యవసాయ పంటలపై ఆశించి విపరీతమైన నష్టాన్ని కలిగించే ఆఫ్రికన్ నత్తలను ముందుగా గుర్తించి నివారించకుంటే భవిష్యత్‌లో రైతులు తీవ్రనష్టాలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. కేరళరాష్ట్రంలో ఈ ఆఫ్రికన్ నత్తల వల్ల అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోయినట్టు వివరించారు. మన ప్రాంతంలో మామూలుగా ఉండేవి తెల్లనత్తలు. ఇవి పరిమాణంలో చిన్నవి. వీటివల్ల పంటలకు పెద్దగా నష్టం ఉండదు. కానీ ఇవి ఆఫ్రికా దేశం నుంచి వందేళ్ల కిందటే మనదేశంలోకి ఈ నత్తలు వచ్చాయి. ఇది పరిమాణంలో పెద్దదిగా ఉంటుంది. పొలంలోని తప్పులు, ఆకుల కింద గాలి, వెలుతురు తగలని ప్రదేశాలలో ఉండి జూలై నుంచి ఫిబ్రవరి వరకూ సంతానోత్పత్తికి అనుకూలంగా ఉన్నప్పుడు 100- 400 గుడ్లు పెట్టి పిల్లలను చేస్తాయి. ఏడాదికి కనీసం 1000- 1200 పిల్లలను పెడుతుంది. ఈ నత్తల జీవితకాలం సుమారు 5-6 సంవత్సరాలు. ఈ కాలంలో సుమారు 5000 పిల్లలను పెడుతాయి. ఇవి పెద్దఎత్తున పిల్లలు పెట్టడం వల్ల ఇవి బొప్పాయి. అరటి, జామ, కూరగాయలు, వక్కల, ఆయిల్‌ఫామ్ వంటి పంటలను ఆశించి కనీవిని ఎరగని రీతిలో రైతులకు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. ఈ నత్తల వల్ల మొక్కజొన్న, పత్తి లాంటి ఇతర పంటలకు కూడా పెద్దఎత్తున నష్టాన్ని కలిగిస్తున్నాయి. కానీ నీరు నిల్వ ఉండే వరి పంటల విషయంలో పెద్దగా నష్టం ఉండదు.

నత్తల నివారణ చర్యలు

రైతులు ఒత్తుగా గాలి, వెలుతురు, సూర్యరశ్మి సోకకుండా ఉండేటట్టు పంటలు వేసుకోకూడదు. వేర్లతోపాటు కలుపు మొక్కలను, చెత్త కుప్పలను పొలం నుంచి తొలగించాలి. ఎప్పటికప్పుడు తోటల్లో అంతర సేద్యంగా శుభ్రంగా చేసుకుని ఎక్కడ తుప్పలు లేకుండా చూసుకోవాలి. రాత్రులు నీరు పారించకూడదు. పగటిపూట మాత్రమే నీటిపారుదల ఇవ్వాలి. అవకాశం ఉంటే బాతులు, కోళ్ల లాంటివి పెంచుకోవాలి. పొలం గట్లపైన ఉప్పునీటిలో ఉంటే ఒక కిలో ఉప్పును 4 లీటర్లతో కలిపిన ద్రావణంలో ముంచిన గోనె సంచులు పరిచినట్టయితే ఇతర పొలాల్లో నుంచి వేరే పొలంలోకి ఇవి రాకుండా ఉంటాయి. రైతులు చేతికి గ్లౌజులు తప్పనిసరిగా వేసుకుని ఉప్పు ద్రావణంలో వాటిని వేసే అవి చనిపోతాయి. వరితవుడు 25 కిలోలు, థియోడికార్బ్ 100 గ్రాములు గుళికలు, బెల్లం 3 కిలోలను 100 గ్రాముల ఆముదంతో కలిసి చిన్న చిన్న ఉండలు చేసి పొలంలో అక్కడక్కడ పెట్టడం ద్వారా ఆ విషపు ఉండలు తిని చనిపోతాయి. అలాగే మెటల్డిహైడ్ గుళికలు (2.5-4 శాతం)ను ఎకరానికి 3- 5 కిలోలు తీసుకుని వచ్చి ఎకరా పొలంలో చల్లితే చనిపోతాయి. చిలేటెడ్ కాపర్ 3 గ్రాములు, ఫెర్రోమేగ్ 3 గ్రాములు ఒక లీటర్ నీటిని కలిపి పిచికారి చేస్తే ఆ నత్తలు కేవలం 2 నిమిషాల్లో కిందపడిపోయి 95 శాతం చనిపోతాయి. కొన్ని కింద పడినప్పటికీ కదలిక ఉంటే వాటిని 5కిలోల గడ్డ ఉప్పు కరగించిన ద్రావణంలో వేస్తే ఖచ్చితంగా చనిపోతాయి. చివరి నత్త వరకూ చంపాలి. అలా చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం కోనసీమలోని గంగలకుర్రులో నత్తలు ఉద్యాన పంటలను నష్టపరుస్తున్నట్టు రైతు తెలియజేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తాం. రైతులు అప్రమత్తంగా ఉండి వాటిని ముందుగానే గుర్తించి నివారణకు చర్యలు తీసుకోవాలి. లేకుండా లేకుండా భవిష్యత్‌లో ఉద్యాన పంటలను వేసుకునే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

- డాక్టర్ వి.అనూష, కీటకవిభాగం శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన కేంద్రం, అంబాజీపేట

ఎన్నో మందులు పిచికారీ చేశాం..

మొక్కలకు పురుగు పట్టాయని అనేక రకాల పురుగు మందులు పిచికారి చేశాం. అయినప్పటికీ పంటలు నాశనం అవుతున్నాయి. అయితే ఒక్క రోజు తెల్లవారుజామున వెళ్లి మొక్కలను పరిశీలిస్తే ఈ నత్తలు చెట్లను పట్టుకుని తినేస్తున్నాయి. పంటకు సుమారు రూ.50వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుని ఈ నత్తల నివారణను అరికట్టాలి.

- చిరతపూడి ఆంజనేయులు, రైతు, గంగలకుర్రు

ఆధార్ ఉంటేనే రైలు టికెట్



- టికెట్ల జారీలో మార్పులు చేసిన రైల్వేశాఖ

మండపేట,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రైలు టిక్కెట్ల దుర్వినియోగాన్ని అరికట్టడంతోపాటు ప్రయాణికులకు మేలు చేసేలా రైల్వేశాఖ పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈఏడాది జూలై1నుంచి పలు సంస్కరణలను చేపట్టింది. తాజాగా ఈనెల 1నుంచి మరిన్ని నిబంధనలు అమల్లోకి తీసుకువచ్చింది. ఐఆర్‌సీటీసీ యాప్ వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఉన్న మొబైల్ నెంబరుతో ఆధార్‌కార్డు లింక్ అయ్యే లా చేసింది.

గతంలో ఐఆర్‌సీటీసీ ఖాతా ఉంటే టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు ఉండేది. కొందరు ఏజెంట్లు ఒక్కో ఖాతానుంచి ఎక్కువగా టిక్కెట్‌లు బుక్ చేసుకుని దుర్వినియోగానికి పాల్పడేవారు. దీంతో సాధారణ ప్రయాణికులుకు తత్కాల్ టిక్కెట్‌లు లభ్యం కావడం కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో ఈఏడాది జూలై 1నుంచి నూతన నిబంధన అమల్లోకి తెచ్చింది. ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఉన్న మొబైల్ నెంబరుతో ఆధార్‌కార్డు అనుసంధానమై ఉంటేనే బుక్ చేసుకునేలా మార్చింది. ఏసీ తత్కాల్‌ను ఉదయం 10గంటలనుంచి,స్లీపర్ తత్కాల్ టిక్కెట్లను 11గంటలనుంచి రిజర్వేషన్ చేసుకునేలా మార్పు చేసింది. తాజాగా ఈనెల 1నుంచి సాధారణ రిజర్వేషన్ టిక్కెట్లకు ఇదే విధానం అమలు చేస్తోంది. ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఉన్న చరవాణి ఫోన్ నెంబరుతో ఆధార్ లింక్ చేసుకున్న ప్రయాణికులు ఉదయం 8గంటలకే టిక్కెట్లను తీసుకునేలా, లింక్ కానీ వారు ఉదయం 8.15గంటలనుంచి టిక్కెట్‌లు తీసుకునేలా మార్పు తెచ్చింది.

రైతుకు చేయూత

- ఉద్యాన పంటలకు రాయితీలతో ప్రోత్సాహం



మండపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):మన దేశంలో రైతుకు వ్యవసాయం ప్రాణాధారం. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో వారు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలో సాగులో వారికి అవసరమైన వ్యవసాయ పనిముట్లు, యాంత్రీకరణ సామాగ్రిని రైతులకు ప్రభు త్వం సబ్సిడీపై అందిస్తోంది. ఈ మేరకు జిల్లా ఉద్యానవనశాఖాధికారి రమణ వివరాలను వెల్లడించారు.

- **మామిడి:** దీనికి ఏడున్నర మీటర్ల పొడవు, వెడల్పుతో సాగు చేస్తే రెండేళ్లకు హెక్టారుకు రూ.50వేలు, ఐదున్నర మీటర్ల పొడవు, వెడల్పుతో సాగుచేస్తే రూ.80వేలు ప్రభుత్వం అందిస్తోంది.
- **జీడిమామిడి:** పొడవు, వెడల్పు ఆరు మీటర్లు ఉండేలా సాగుచేస్తే రెండేళ్లకు హెక్టారుకు రూ.30వేలు. పొడవు, వెడల్పు ఐదు మీటర్లతో సాగుచేస్తే రూ.60వేలు అందిస్తోంది.
- **ఆయిల్‌పామ్:** 9మీటర్లపొడవు,వెడల్పు ఉండేలా సాగుచేస్తే మొక్కలు, ఎరువుకు నాలుగేళ్లపాటు హెక్టారుకు రూ.71వేలు ఇస్తారు.
- **కోకో:** కొబ్బరిలేదా ఆయిల్‌పామ్ సాగులో అంతర్ పంటగా కోకో సాగు చేసే రైతులకు రెండేళ్లకు హెక్టారుకు రూ.30వేలు ఇస్తారు.
- **జామ:** పొడవు వెడల్పు, మూడు మీటర్లు సాగు చేస్తే రెండేళ్లకు హెక్టారుకు రూ.80వేలు అందిస్తారు.
- **నిమ్మ, బత్తాయి:** పొడవు, వెడల్పు ఆరు మీటర్లు ఉండేలా సాగు చేస్తే హెక్టారుకు రెండేళ్లకు రూ.50వేలు అందిస్తారు.
- **డ్రాగన్‌ఫ్రూట్:** పొడవు, వెడల్పు 3 మీటర్లు ఉండేలా సాగు చేస్తే హెక్టారుకు రూ.2.70లక్షలు రాయితీ అందిస్తారు.
- **స్ప్రేయర్లు:** ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు రూ.10వేలు, మిగిలిన వారికి రూ.8వేలు రాయితీ అందిస్తారు. మల్చింగ్ షీటుకు హెక్టారుకు రూ.16వేలు, షెడ్డు నెట్‌కు 50శాతం సబ్సిడీ మామిడి, అరటి పండ్ల కవర్లకు హెక్టారుకు రూ.25వేలు అందిస్తోంది.
- **యంత్ర పరికరాలకు..:** చిన్నట్రాక్టరు ధర రూ.4లక్షలు. ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ, మిగిలిన రైతులకు రూ.1.60లక్షలు సబ్సిడీతో ఇస్తోంది.
- **పుట్టగొడుగులు:** రూ.30లక్షలు విలువ చేసే పుట్టగొడుగుల తయారీ యూనిట్‌కు రాయితీ రూ.12లక్షల మేర సబ్సిడీ అందిస్తోంది.
- జీడి, కోకో శుద్ధి చేసే యూనిట్ ధర రూ.35లక్షలు కాగా రూ.12.25లక్షలు సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది.

విదేశాల్లో విద్య, ఉద్యోగ అవకాశాలు



కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విదేశాల్లో విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు కాకినాడ జిల్లా ఇన్చార్జి అధికారి వీడీజీ మురళి తెలిపారు. ఖతర్ దేశంలోని దోహా నగరంలో హరామ్ కేర్ నర్స్ (రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాల కోసం అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గలవారు బీఎస్సీ లేదా జీఎన్ఎం నర్సింగ్ విద్యార్హతలతో పాటు కనీసం రెండు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.1.20 లక్షల వరకు టాక్స్ ఫ్రీ వేతనం, అదనంగా ఉచిత వసతి, వైద్య సేవలు, రవాణా సదుపాయాలు లభిస్తాయి. ఈ నెల 13వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

- జర్మనీ దేశంలో ఫిజియోథెరపీ, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ ఉద్యోగాలకు అవకాశాలున్నాయి. బీపీటీ, డిప్లొమా లేదా డిగ్రీ ఇన్ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులు. ఫ్రెషర్స్‌కి నెలకు రూ.2,500 నుంచి రూ.3 వేల యూరోలు(రూ.3,10,350) వేతనం లభిస్తుంది. ఎంపికైన వారు జర్మన్ భాషా శిక్షణ పొందవలసి ఉంటుంది. ఇందుకు రూ.లక్ష ఫీజు చెల్లించాలి. వయసు 18-40 సంవత్సరాల మధ్య గల అభ్యర్థులు అర్హులు. ఈ నెల 15వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- రష్యా దేశంలోని మెటలర్జికల్ కాలేజీలో మెటలర్జీ డిప్లొమా కోర్సు కోసం పూర్తి స్థాయి స్కాలర్‌షిప్ (ట్యూషన్ ఫీ+వసతి ఉచితం) అందుబాటులో ఉంది. కోర్సు వ్యవధి 3 సంవత్సరాల 6 నెలలు. క్యాంపస్‌లో ఫుల్‌టైమ్ విధానంలో క్లాసులు ఉంటాయి.ఐటీఐ, ఇంటర్మీడియట్ (ఎంపీసీ), వృత్తిపరమైన లేదా ఒకేషనల్ కోర్సులు చదివిన వారు అర్హులు. వయసు 18 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉండి, ఇంగ్లీష్‌లో కనీసం 75 మార్కులు సాధించి ఉండాలి. ఈ నెల 13వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఆసక్తి గల వారు పాస్‌పోర్ట్, విద్య ధ్రువపత్రాలు, అవసరమైన పత్రాలతో https://naipunya m.ap.gov.in/user-registration?page=programcregistration వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 99888 53335, 87126 55686, 99592 20422, 85008 85866 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఇన్చార్జి అధికారి మురళి పేర్కొన్నారు.

రేపు పిఠాపురానికి డిప్యూటీ సీఎం పవన్



పిఠాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ నెల 9వ తేదీన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించే అవకాశాలున్నాయి. ఇందుకు సంబంధించి అధికారిక సమాచారం రావాల్సి ఉంది. బుధవారం ఆయన కొత్తపల్లి మండలం అమీనాబాద్ హెలికాప్టర్‌లో చేరుకుని అక్కడ మత్స్యకారులతో సమావేశం కానున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టర్ నగిలి షాన్‌మోహన్ మంగళవారం రాత్రి అధికారులతో సమీక్షించారు. ఉప్పాడ హార్బర్, తొండంగి మండలంలో ఎక్కడ హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలనే అంశంపై పరిశీలన జరిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఎంపీడీవోల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఈటీసీ ప్రిన్సిపాల్ ప్రసాదరావు



ఎంపీడీవోలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

సామర్లకోట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించి మంచి అధికారిగా పేరు తెచ్చుకోవచ్చని కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ కేవీఎస్ ప్రసాదరావు పేర్కొన్నారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో నెల రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న రెండో బ్యాచ్ ఎంపీడీవోల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం మంగళవారం సాయంత్రం వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసాదరావు మాట్లాడుతూ శిక్షణను ఒక మంచి అవకాశంగా భావించి కొత్త విషయాలు నేర్చుకోవాలన్నారు. అన్ని స్థాయిల్లో నైపుణ్యాలు పెంపొందించుకుని పంచాయతీరాజ్ ప్రతిష్ట పెంచాలని చెప్పారు.ఈ సందర్భంగా శిక్షణను పూర్తిచేసుకున్న ఎంపీడీవోలు ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాళ్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఎస్. శర్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో రిషిత్‌కు కాంస్యం



కాకినాడ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో ఇటీవల జరిగిన సీబీఎస్ఈ జాతీయ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో సెబర్ సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో కాకినాడ లక్ష్య ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థి నల్లమిల్లి శేషు రిషిత్‌రెడ్డి కాంస్య పతకం సాధించినట్టు స్కూలు అధినేత ఎన్.సుగుణారెడ్డి తెలిపారు. ఫెన్సింగ్ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజీవ్‌మెహతా మాట్లాడుతూ సీబీఎస్ఈ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌లో మొదటిసారిగా ఆంధ్ర నుంచి క్రీడాకారులు మంచి పోటీ ఇచ్చారన్నారు. పతకం సాధించిన శేషురిషిత్‌ను, ప్రిన్సిపాల్ వందనా బొహరాను, శిక్షకులు సతీష్, బేబీరెడ్డిలను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ఎన్.సుగుణారెడ్డి అభినందించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌తో అనపర్తి ఎమ్మెల్యే భేటీ



బుచ్చిరామ్‌ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మంగళవారం ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చిరామ్‌ప్రసాద్‌తో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భేటీ అయ్యారు. అనపర్తి నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి, సంక్షేమంపై ఆయన ప్రత్యేకంగా చర్చించారు. అనపర్తి నియోజకవర్గంలో ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వివిధ ఆలయాల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సత్యదేవుడికి దేవదాయ కమిషనర్ పూజలు



పశ్చిమ రాజగోపురం వద్ద నిర్మిస్తున్న షెడ్డును పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

అన్నవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. విజయనగరం పైడితల్లి సిరిమాను ఉత్సవంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయన మార్గమధ్యంలో ఉన్న స్వామిసన్నిధికి సోమవారం రాత్రి చేరుకుని బసచేసి మంగళవారం ఉదయం ప్రారంభ సమయంలో స్వామిని దర్శించుకున్నారు. అనంతరం పశ్చిమ రాజగోపురం వద్ద దాత సహకారంతో నిర్మిస్తున్న షెడ్డును, ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఫ్యాన్సీ షాపు గొడౌన్‌ను పరిశీలించారు. ఆయన వెంట అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంటా విష్ణు తదితరులున్నారు.

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి హోమాలు, జపాలు, పారాయణలు నిర్వహించారు. 11గంటలకు హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి జరిపారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చుక్కల జింక ప్రాణాలు కాపాడిన వైద్యులు

- అడవి నుంచి మైదాన ప్రాంతానికి వచ్చి కుక్కల దాడిలో గాయపడిన వన్యప్రాణి
- ప్రత్తిపాడులో వైద్య సేవలు



ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో జింకకు చికిత్స చేస్తున్న వైద్యుల బృందం

ప్రత్తిపాడు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అడవి నుంచి ఆహారం కోసం మైదాన ప్రాంతానికి వచ్చిన వన్యప్రాణి చుక్కల జింకపై కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన జింకకు మంగళవారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు పశువైద్యులు సకాలంలో చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యం అటవీ ప్రాంతం నుంచి చుక్కల జింక ఆహారం కోసం పెద్దాపురం మండలం ఆనూరు గ్రామానికి చేరుకుంది. అయితే అక్కడ కుక్కలు దాడి చేయడంతో స్థానికులు జిల్లా అటవీశాఖాధికారి ఎం.రామచంద్రరావుకు సమాచారం అందించారు.దీంతో ఏలేశ్వరం ఫారెస్ట్ అధికారులు తీవ్రంగా గాయపడిన చుక్కల జింకను మంగళవారం ప్రత్తిపాడు ఏరియా వెటర్నరీ ఆసుపత్రికి తరలించారు. పశు వైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్. బాలచంద్ర యోగేశ్వర్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలందించారు. సకాలంలో వైద్యం అందించడంతో కోలుకున్న చుక్కల జింకను ఏలేశ్వరం అటవీశాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం లింగంపర్తి రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో వదిలివేశారు.

10 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో సేవలు బంద్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ నెట్ వర్క్ ఆసుపత్రులలో వైద్యసేవలను బంద్ చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ప్రకటించింది. ఈమేరకు రాజమహేంద్రవరంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసుపత్రులకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ నుంచి రావాల్సిన బకాయిలు సుమారు రూ.2,700 కోట్లు పైమాటే ఉన్నాయని, ఇంకా ఏ నెలకు ఆ నెల బకాయిలు పెరుగుతూనే ఉన్నాయే తప్ప క్లియర్ కావడంలేదని తెలిపింది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బతుకు భారమైందని పేర్కొంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి అసెంబ్లీలో నెట్ వర్క్ ఆసుపత్రుల బకాయిలపై ప్రకటించారే తప్ప చేతల్లో ఫలితం కనిపించడంలేదని, ఈ తరుణంలో గత నెల 24న సమావేశమైన ఆషా రాష్ట్ర కార్యవర్గం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించిందని, దానికి అనుగుణంగానే ఈనెల 10 నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద వైద్యసేవలను నిలిపివేయాలని నెట్ వర్క్ఆసుపత్రులు నిర్ణయించాయిని ఆషా పేర్కొంది. ఇప్పటికే మంత్రులకు, ఎంపీ, ఎమ్మెల్యేలకు, కలెక్టర్లను కలిసి తమ ఆవేదన విన్నవిస్తూనే ఉన్నామని ఈ నెల 10వ తేదీ లోగా సమస్యకు పరిష్కారం లభించకపోతే ఎన్టీఆర్ వైద్యసేవలు పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించినట్టు ఆషా ప్రకటించింది. ఏడాది కాలంగా తాము పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రజలంతా అర్థం చేసుకుంటారని భావిస్తున్నామని తెలిపింది.

'క్రమశిక్షణతో ఉండాలి'

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషికి క్రమశిక్షణ, సహనం కచ్చితంగా ఉండాల్సిన లక్షణాలని, వాటిని అలవర్చుకొంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర పర్యవేక్షణ గృహాన్ని ఆమె సందర్శించి వసతులను పరిశీలించారు.బాలలతో మాట్లాడి బాగోగులపై ఆరా తీశారు. మంచి, చెడు స్పర్శల గురించి వివరించారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైతే డీఎల్ఎస్ఏని సంప్రదించాలని సూచించారు.

ధీరూభాయ్ అంబానీ క్విజ్‌కి దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 30 వరకూ గడువు.. తూర్పుగోదావరి జిల్లా విద్యాధికారి వాసుదేవరావు

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తమ కేజీడీ-6 విభాగం ద్వారా సామాజిక కార్యక్రమాల్లో భాగంగా గత 13ఏళ్లుగా రిలయన్స్ ధీరూభాయ్ అంబానీ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా విద్యాధికారి వాసుదేవరావు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాదికి సంబంధించి ఈ నెల 30వరకూ దరఖాస్తులను స్వీకరిస్తున్నారన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో మంగళవారం క్విజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జట్టుకు ఇద్దరు చొప్పున ప్రతి పాఠశాల నుంచి రెండు జట్లు పాల్గొనవచ్చన్నారు. జిల్లాకు సంబంధించి డిసెంబరు 2న రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో పోటీలు ఉంటాయన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 0884-3577222, 63022 23156 నెంబర్లలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 99599 88835లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఓఎన్జీసీ గ్యాస్ పైపులైన్ పేలుడు.. నష్టం అంచనాకు బృందం నియామకం

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల, మాజీ మంత్రి మల్లాడి

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): యానాం సమీపంలోని దరియాల తిప్ప వద్ద ఆగస్టు 22న ఓఎన్జీసీ గ్యాస్ పైపులైన్ పేలడం వల్ల జరిగిన నష్టాన్ని శాస్త్రీయ పద్ధతిలో అంచనా వేయడానికి బృందాన్ని నియమించామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మత్స్యశాఖ అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పేలుడు ఘటనతో మత్స్య సంపదకు ఎంతవరకు నష్టం జరిగింది, మత్స్యకారుల జీవన భృతికి ఏ విధంగా ఆటంకం ఏర్పడింది అనే విషయాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ నష్టాన్ని అంచనా వేయడానికి సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (విశాఖపట్నం)కు చెందిన డాక్టర్ జో నేతృత్వంలో అధ్యయన బృందాన్ని నియమించారన్నారు. పేలుడు సంభవించిన ప్రాంతానికి చుట్టు పక్కల ఉన్న గ్రామాలను, ఎక్కువ నష్టం జరిగిన కోర్ గ్రామాలను, పెరీ ఫ్రీ గ్రామాలను నిర్ధారించాలని బృందాన్ని కోరామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించాలని కోరామన్నారు. సముద్రం, నది, నది ముఖద్వారాల వద్ద బోట్లు తిరగడానికి ఆటంకంగా ఉన్న ఇసుక మేటలను తొలగించాలన్నారు. తుది రిపోర్టును వారంలో ఇవ్వాలని బృందాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. సమావేశంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ డాక్టర్ అంజలి, జిల్లా మత్స్య శాఖ అధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

కూటమి వర్సెస్ వైసీపీ

(ఐదో పేజీ తరువాయి)

అంశంపై చర్చలో అధికారులు మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో 4.79 లక్షల ఎకరాల్లో రైతులు పంట సాగు చేపట్టగా ఇప్పటి వరకు 60 టీఎంసీల నీరు విడుదల చేశామన్నారు. నాణ్యత లేని విత్తనాల కారణంగా పిఠాపురం నియోజకవర్గంలో పత్తి సాగు చేసిన రైతులు నష్టపోతున్న విషయాన్ని సభ్యులు ప్రస్తావించగా లామ్, డాట్ సెంటర్ల శాస్త్రవేత్తల బృందం నివేదిక ఆధారంగా రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపడతామని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సమాధానమిచ్చారు. వైద్యఆరోగ్యం సమీక్షలో సభ్యులు మాట్లాడుతూ ఇటీవల తుని ఏరియా ఆసుపత్రిలో ప్రసవించిన మహిళ మృతి ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తొండంగి జడ్పీటీసీ కోరగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఘటనపై కాకినాడ జీజీహెచ్ వైద్యులతో విచారణ జరిపిస్తున్నామని బదులిచ్చారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆల మూరు మండలం లంక భూముల్లో మట్టిని ఇటుక బట్టీలకు లోతుగా తవ్వేస్తున్నందున కూరగాయల పంట సాగు కనుమరుగవుతోందని, దీన్ని నియంత్రించాలని అధికారులకు సూచించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాలను అమలాపురం ఇరిగేషన్ డివిజన్ పరిధి నుంచి హెడ్‌వర్క్స్ డివిజన్ పరిధిలోకి మార్చాలన్నారు. వర్షాధారంపై పంటలు సాగు చేసే ఏజెన్సీ ప్రాంత రైతులకు సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏజెన్సీ మండలాల ప్రజా ప్రతినిధులు అధికారులను కోరారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రతి 3నెలలకొకసారి ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు నిర్వహించాలని కోరగా అందుకు పీవో అంగీకరించారు. ఏజెన్సీ మండలాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల్లో ప్రొటోకాల్ పాటించాలని జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్

జీఎస్టీ తీర్మానంపై చర్చ

జీఎస్టీ జీఎస్టీ తగ్గించడంపై ప్రధాని మోదీ, జీఎస్టీ మండలికి అభినందనలు తెలపాలి అంటూ అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సూచించగా.. దానికి సభ్యులు వ్యతిరేకతపై వాడీవేడిగా చర్చసాగింది. దీనిపై ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, జ్యోతుల నెహ్రూ, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మధ్య చాలా సేపు వాదోపవాదాలు జరిగాయి. తీర్మానం చేయలేదు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్‌దాట్ల బుచ్చిరాజు, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, రంపచోడవరం ఐటీడీఏ పీఓ బి.స్మరన్‌రాజు, తూర్పుగోదావరి జిల్లా డీఆర్వో టి.సీతారామమూర్తి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా డీఆర్వో కె.మాధవి, జడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు, జడ్పీ వైస్‌ఛైర్మన్ బుర్రా అనుబాబు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఒక ప్రమాదం.. రెండు కుటుంబాల్లో విషాదం

రెండు మోటారుసైకిళ్లు ఢీకొని ఇద్దరి మృతి

నరేంద్రపురం-నందరాడ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై సంఘటన





సంఘటనా స్థలంలో మృతదేహాలు



మోటార్ సైకిల్

రాజానగరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం-నందరాడ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజానగరంలోని సుబ్బారావు కాలనీకి చెందిన బుదిరెడ్డి సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు (32) జట్టు కూలీగా పని చేస్తున్నాడు. భార్య మంగ ఆశా వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సత్తిబాబు, మంగ రాజానగరంలోని ఒక దుకాణంలో పని చేసిన సమయంలో ఏర్పడిన పరిచయంతో పదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్తిబాబు మోటార్‌సైకిల్‌పై కోరుకొండ వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో నందరాడ దాటిన తర్వాత మలుపులో మరో మోటార్‌సైకిల్‌పై ఎదురుగా వస్తున్న కొవ్వూరుకు చెందిన మెర్ల శ్రీనివాస్ (45) ప్రమాదవశాత్తూ బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరి తలలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరి కుటుంబాల్లో ఇంటి యజమానులు మరణించడంతో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్ సీజ్

రాజానగరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా నుంచి కాకినాడకు ఐషర్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మార్గమధ్యంలో రాజానగరం హైవేపై పట్టుకున్నట్టు రాజానగరం సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఏపీ 39-యుకె 4427 నెంబరు కలిగిన ఐషర్ వ్యాన్‌లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకుని డ్రైవర్‌ను విచారించగా కృష్ణా జిల్లా ఉయ్యూరు పట్నం నుంచి కాకినాడ జిల్లా పిఠాపురానికి తరలిస్తున్నట్టు చెప్పాడన్నారు. గొల్లప్రోలుకు చెందిన గారపాటి రాజు వాహన యజమాని అని భోగాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ కోరసిక విజయ్ చెప్పాడన్నారు. వాహనంలో సీమ్యార్ గోనె సంచుల్లో 13,750 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. డ్రైవర్ వద్ద ఏవిధమైన రికార్డులు లేవని, బియ్యంతో సహా వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.. బియ్యం విలువ రూ.6,32,500గా నిర్ధారించామన్నారు. వ్యాన్‌ను రాజానగరం పోలీసులకు అప్పగించినట్టు బాపిరాజు తెలిపారు.

అశ్లీల నృత్యాలపై దాడి

ఐదుగురిపై కేసు

కోటనందూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కేఈ చిన్నాయిపాలెం గ్రామంలో దసరా సందర్భంగా నిర్వహించిన అశ్లీల నృత్యాలు (రికార్డింగ్ డాన్స్)పై కోటనందూరు పోలీసులు దాడి చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కేఈ చిన్నాయిపాలెంలో 2 వాహనాలపై హిజ్రాలతో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తున్నట్టు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు వచ్చిన సమాచారం రావడంతో దాడి చేశారు. హిజ్రాలతో పాటు గ్రామస్తులు పారిపోయారు. 2 వాహనాలను సీజ్ చేసి ఉత్సవ కమిటీ సభ్యులైన లాలం అచ్యూతానంద(బాబ్జీ), కరక నాగేశ్వర రావు, లాలం వెంకినాయుడు, లాలం నగేష్, లెక్కల అప్పలనాయుడిపై కేసు నమోదు చేసినట్టు సీఐ చెన్నకేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ కృష్ణామాచారి సిబ్బంది ఉన్నారు.

మద్యం మత్తులో హత్య...

తునిలో యువకుడి హత్య కేసులో నిందితులను పట్టుకున్న పోలీసులు

వివరాలు వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

పెద్దాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సీపట్నం బస్టాండ్ వద్ద ఈనెల 2న జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. పెద్దాపురం డీఎస్పీ కార్యాలయంలో హత్యకు దారితీసిన కారణాలను డీఎస్పీ డి.శ్రీహరిరాజు మీడియాకు మంగళవారం వెల్లడించారు. వివరాల్లోకి వెళితే... ఈనెల 2న నర్సీపట్నం బస్టాండ్ వద్ద గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన బొడ్డు సురేష్, పాయకరావుపేటకు చెందిన తార ప్రసాద్ మద్యం తాగుతూ ఉండగా అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం యరకంపాలెం గ్రామానికి చెందిన తానారి అప్పలనాయుడు (37) మద్యం మత్తులో బస్‌స్టాండ్‌కి వచ్చాడు. సమీపంలో మద్యం తాగుతున్న సురేష్, ప్రసాద్‌తో మాట్లాడుతూ వారిపై పడడంతో అప్పలనాయుడిని కిందకు తోసేశారు. అప్పలనాయుడు జేబులో నుంచి సెల్‌ఫోను, నగదు బయటపడడంతో లాక్కునేందుకు ప్రయత్నించారు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో బ్రిడ్జి కింద రేకుల షెడ్డు వద్ద అప్పలనాయుడు పడిపోవడంతో ప్రసాద్, సురేష్ ఇద్దరు పక్కన ఉన్న రాయి, ఇనుప రాడ్డుతో అప్పలనాయుడు ముఖంపై విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో అప్పలనాయుడు మృతిచెందాడు. అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్, రూ.500 నగదును తీసుకుని ఇనుపరాడ్డును సమీపంలో తుప్పల్లో పారవేసి పరారయ్యారు. దీంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితులను పట్టుకున్నారు. అలాగే హత్యకు ఉపయోగించిన రాడ్డు, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐలు చెన్నకేశవరావు, గీత రామకృష్ణ ఎస్ఐలు కృష్ణమాచారి, జగన్మోహన్, విజయ్ బాబులను జిల్లా ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు.

కొవ్వాడలో పట్టపగలే చోరీ

50 కాసుల బంగారం అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ఎస్ఐ

కాకినాడ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వాడలోని ప్రధాన కూడలి సమీపంలోని ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. సుమారు 50 కాసుల బంగారం అపహరణకు గురైంది. ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఇంటి యజమాని మక్కా చిన్నారావు కిర్లంపూడి ఎంఈవోగా, ఆయన భార్య మాధవపట్నం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటల తర్వాత దంపతులిద్దరూ ఇంటి గేటుకి, ప్రధాన ద్వారానికి తాళాలు వేసుకుని ఉద్యోగాలకు వెళ్లారు. సాయంత్రం 5గంటలకు చిన్నారావు ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు బద్దలుగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో కంగారుపడి చోరీ జరిగినట్టు ఇంద్రపాలెం పోలీసులకు సమాచారమిచ్చారు. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, క్లూస్ టీం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించింది. చిన్నారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్తిపాడులో పాము కాట్లు

ఒకేరోజు వేర్వేరు చోట్ల

నలుగురిని కాటేసిన సర్పాలు

ప్రతిపాడు ఆసుపత్రిలో బాధితులు





ప్రత్తిపాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రత్తిపాడు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో మంగళవారం వేర్వేరు చోట్ల నలుగురు వ్యక్తులు పాము కాట్లకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో శరభవరం గ్రామానికి చెందిన కుట్టు మిషన్ కార్మికుడు గొణగాల నరసింహమూర్తి మంగళవారం సాయంత్రం మిషన్ వద్ద పనిచేస్తుండగా తాచుపాము కాటు వేసింది. దీంతో స్పృహ కోల్పోయిన అతడిని వెంటనే కుటుంబ సభ్యులు ప్రతిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అలాగే గజ్జనపూడి, పెద్దశంకర్లపూడి గ్రామాలకు చెందిన రైతులు బొబ్బిలి వీరబాబు, పి.వీరవెంకట సత్యనారాయణ సాయంత్రం పొలం పనుల్లో పాముకాట్లకు గురయ్యారు. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి బంధువులు తరలించారు. అలాగే ఎర్రవరం గ్రామానికి చెందిన పి.వీరబాబు పొలంలో నుంచి వస్తుండగా కట్లపామును గమనించకుండా తొక్కేశాడు. దీంతో పాటు కాటు వేసింది. కంగారుతో కేకలు వేయడంతో స్థానికులు కట్ల పామును చంపేసి బాధితుడిని మంగళవారం రాత్రి 9 గంటలకు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నలుగురికి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య మైకేల్, సిబ్బంది వైద్యం అందిస్తున్నారు. ఒక్కొక్కరికి 20 యాంటీ పైనల్స్ ఇంజక్షన్లు ఇచ్చామని, ప్రాణాలు కాపాడడానికి రాత్రంతా చికిత్స అందించనున్నామని సౌమ్య మైకేల్ తెలిపారు.

ప్రయాణికులపై దాడి కేసులో నలుగురి అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మండపేట రూరల్ సీఐ దొర్రాజు

రాయవరం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులపై దాడికి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్టు మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు తెలిపారు. మంగళవారం రాయవరం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మాచవరం వంతెన వద్ద సోమవారం తెల్లవారుజామున ఆటో కోసం వేచి చూస్తున్న అనుసూరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సోమేశ్వరానికి చెందిన శాఖ వంశీ అతడి స్నేహితులు ముగ్గురు కలిసి కామెంట్ చేశారు. అదే సమయంలో ఆటో డ్రైవర్ వాసంశెట్టి రామకృష్ణ అక్కడకు చేరుకుని శ్రీనివాస్ బంధువులను ఆటోలో ఎక్కించుకుని వారి స్వగ్రామం వెదురుపాకసావరం వైపు బయలుదేరగా సోమేశ్వరం శివాలయం వద్దకు వచ్చేసరికి శాఖ వంశీ అతడి మిత్రులు కారులో ఆటోకు అడ్డుతగిలి ఆటోలో ఉన్న ప్రయాణికులను చంపేస్తామని బెదిరించి డ్రైవర్ పై దాడి చేశారు. అతడి సెల్‌ఫోన్ లాక్కున్నారు. ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలు ఎందుకు దాడి చేస్తున్నారని ప్రశ్నించగా వారిపై కూడా దాడికి పాల్పడ్డారు. బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వెళ్లారు. ఆసుపత్రి నుంచి పోలీసులకు వచ్చిన ఫిర్యాదుపై బాధితుల నుంచి వివరాలను సేకరించి రాయవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఎస్ఐ హరిశ్‌కుమార్ నేతృత్వంలో కేసులో నిందితులైన శాఖ విన య్‌వంశీ (సోమేశ్వరం), మాచవరపు వెంకటసాయిగణేష్ (వెదురుమూడి), రిమ్మల పూడి సాయి (వల్లూరు), పర్వతిని మౌళి సాయి (పులగుర్త)ను మంగళవారం మధ్యాహ్నం మాచవరం పాత పెట్రోలు బంకు వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు. కేసులో నిందితులను వేగంగా పట్టుకున్న పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారని సీఐ చెప్పారు. సమావేశంలో రాయవరం ఇన్‌చార్జి ఎస్ఐ హరిశ్ తదితరులు ఉన్నారు.

గోదావరిలో దూకిన యువకుడి మృతదేహం లభ్యం

మలికిపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో కుటుంబ సభ్యులు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లమని ఒత్తిడి చేస్తుండడంతో గోదావరిలోకి దూకిన యువకుడి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మలికిపురం ఎస్ఐ బి.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం వుయ్యూరివారి మెరకకు చెందిన మేడిద సుదర్శనరాజు (25) రష్యా వెళ్లేందుకు రూ.లక్షా 50వేల జీతంతో ఉద్యోగం వచ్చింది. నాన్నమ్మతో పాటు ఇంట్లో వారు వెళ్లమని ఒత్తిడి చేస్తున్నారు. మద్యానికి బానిసైన సుదర్శనరాజు భార్య, కుమార్తెను వదిలి వెళ్లడం ఇష్టం లేక విదేశాలకు వెళ్లనని ఈనెల 5న ఆదివారం దిండి-చించినాడ వంతెన పైకి వచ్చాడు. అప్పటికే మద్యం తాగి అతడు భార్యతో ఫోన్‌లో మాట్లాడుతూ వంతెనపై నుంచి గోదావరిలోకి దూకేశాడు. యువకుడి మృతదేహం మంగళవారం అంతర్వేది-గొంది నదీ తీరంలో లభించినట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు తెలిపారు.

వాగులో మునిగి పశువుల కాపరి మృతి



మృతి చెందిన ప్రసాద్

ఎటపాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పశువులను మేపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి పశువుల కాపరి వాగులోని వరదనీటిలో మునిగి మృతిచెందిన ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం తోటపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తోటపల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి నక్కా ప్రసాద్ (48) మరో పశువుల కాపరితో కలిసి పశువులను మేపడానికి తోటపల్లి వాగు పరివాహక ప్రాంతం వైపు వెళ్లారు. ఈ క్రమంలో మందలోని కొన్ని పశువులు వాగు దాటి అవలి ఒడ్డు వైపు వెళ్లాయి. దీంతో ప్రసాద్ ఆ పశువుల కోసం వాగు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో మునిగిపోయాడు. అనంతరం కొద్దిసేపటి తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు.

బస్సు ఆపమని... కాలువలోకి దూకిన ఇంటర్ విద్యార్థిని

పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం గాలింపు

లభ్యం కాని ఆచూకీ

ఉండ్రాజవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని మోర్త గ్రామానికి చెందిన జూనియర్ ఇంటర్ విద్యార్థిని మంగళవారం సాయంత్రం దమ్మెన్ను కాలువలోకి దూకింది. గ్రామానికి చెందిన కొప్పుల పూజిత మండలంలోని ఓ ప్రయివేటు జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఉదయం యథావిధిగా కాలేజీకి వెళ్లి తిరిగి బస్సులో సాయంత్రం ఇంటికి వస్తుండగా దమ్మెన్ను కాలువ వంతెనపైకి రాగానే తనకు వాంతులు అవుతున్నాయని, బస్సును ఆపమని చెప్పి దిగిన వెంటనే ఒక్కసారిగా వంతెనపై నుంచి కాలువలోకి దూకేసింది. దీంతో తోటి విద్యార్థి తమ కళ్లెదుటే కాలువలోకి దూకేయడంతో విద్యార్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే స్థానికులు రక్షిద్దామని ప్రయత్నించినప్పటికీ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొట్టుకుపోయింది. సంఘటన తెలిసిన వెంటనే ఉండ్రాజవరం పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం గాలింపు చేపట్టారు. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈమె తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, సుబ్బలక్ష్మి విడాకులు తీసుకుని వేర్వేరుగా తీసుకుని జీవిస్తున్నారు. పూజితకు అక్క, అన్నయ్య ఉన్నారు. అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి చదువుకుంటోంది. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ తిలక్ పరిశీలించారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

గో..దారేది!

వరద తగ్గినా.. తెరుచుకోని ఘాట్లు





గోదావరి వరద తగ్గింది.. అయినా నేటికీ ఘాట్లు తెరుచుకోలేదు.. బంద్ చేసే ఉన్నాయి.. దీంతో భక్తులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదం జరిగిందని 10 రోజుల కిందట గోదావరి పరీవాహక ప్రాంతంలోని అన్ని ఘాట్లు మూసేశారు.. ఎవరినీలోనికి అడుగుపెట్టనీయడం లేదు. అయితే ఘాట్ల వద్ద రక్షణ చర్యలు మాత్రం చేపట్టడంలేదు.. మళ్లీ వరదొస్తే మళ్లీ మూసేయడం తప్ప శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టడంలేదు. ఇటు రాజమహేంద్రవరం, అటు కొవ్వూరు వైపు అంతే. ప్రస్తుతం అయ్యప్ప, భవానీ, వెంకటేశ్వరస్వామి మాలధారులు గోదావరి స్నానానికి ఎక్కువగావస్తుంటారు. ఘాట్లు మూసి వేసి ఉండడంలో నిట్టూర్చుతున్నారు. మరో వైపు మెట్లపై మట్టి పేరుకు పోయింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విజయ వాడ కృష్ణానదిలో మెట్ల వద్ద సిమెంట్ మెస్ అడ్డుగా ఉంటుంది. దీంతో అక్కడ నీట మునిగిన ప్రమాదాలు చాలా అరుదు. ఆ దిశగా గదావరి మన ఘాట్ల వద్ద కూడా అలా ఏర్పాటు చేస్తే వరదొచ్చినా ఇబ్బంది ఉండదని భక్తులు అంటున్నారు.. ఆ దిశగా అధికారులు ఆలోచించాల్సి ఉంది.

- రాజమహేంద్రవరం సిటీ.

సుప్రీంకోర్టు సీజేపై దాడికి నిరసన

గోకవరం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం గోకవరంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. దేవిచౌక్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో, ధర్నా వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ న్యాయవ్యవస్థలపై దాడులు ప్రమాదకరమన్నారు. ప్రధాన న్యాయమూర్తిపైనే దాడులకు తెగబడితే ఇక సామాన్యులకు రక్షణ ఎలా దొరుకుతుందని ప్రశ్నించారు. న్యాయమూర్తి గవాయ్ దళితుడు కాబట్టే ఈ దుర్ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అందజేశారు. కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన ముగ్గురికి, రాజానగరం మండలం నరేంద్రపురం, పాలచర్ల గ్రామాల్లో ఒక్కొక్కరి ఇళ్లకు ఆయన స్వయంగా వెళ్లి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాసుపత్రులు

» ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
» అనపర్తి ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం


రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.మంగళవారం అనపర్తిలోని ఏరియా ఆసుపత్రిలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని, గైనిక్ వార్డులో ఏర్పాటు చేసిన ఏసీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు 30మంది వరకు రక్తదానం చేశారు. రాజమహేంద్రవరం జిల్లా ఆసుపత్రి నుంచి వచ్చిన బ్లడ్ బ్యాంక్ వైద్యులు రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రోజుకు సుమారు 700వరకు ఓపీ నిర్వహిస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా ఆసుపత్రి ఆవరణలో జరుగుతున్న భవన నిర్మాణ పనులపై కాంట్రాక్టరు, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, పాత భవనంపై నిర్మిస్తున్న వార్డులను నెల రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రధాన భవనం వచ్చే మార్చి నాటికి వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, నాయకులు కర్రి శేషారత్నం, గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, డీకే దుర్గాప్రసాద్, అన్నవరం వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృత భాషకు వాల్మీకి ఆదికవి

జయంతి కార్యక్రమంలో ఎస్పీ నరసింహ కిషోర్


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ కిషోర్

రాజమహేంద్రవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సంస్కృత సాహిత్యంలో వాల్మీకి మహర్షికి ఎంతో పేరు ఉందని, అందువల్ల ఆయనను సంస్కృత భాషకు ఆదికవిగా గుర్తించారని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని లిఖించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆధునిక సమాజానికి ఆదర్శప్రాయంగా నిలిచారని ఎస్పీ కిషోర్ కొనియాడారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలోని సీపీ బ్రౌన్ మందిరంలో నిర్వాహకుడు సన్నిధా నం శాస్త్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాల్మీకి చిత్రపటానికి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీతారామ కథాసుధ సంపుటాల రచయిత దీక్షితుల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆదర్శ కుటుంబ వ్యవస్థకు దర్పణంగా వాల్మీకి మహర్షి రామాయణం సృష్టి ఉన్నంతవరకు నిలిచిపోతుందన్నారు. భారతదేశంలో కుటుంబ వ్యవస్థ, నైతిక, ఆధ్యాత్మిక విలువలను శ్రీమద్రామాయణం ద్వారా అందించిన వాల్మీకి నిత్య చిరస్మరణీయుడని అన్నారు. కార్యక్రమంలో తణుకు గోపాలకృష్ణ, జాతీయ చిత్రకారిణి వి.లక్ష్మి, దొంతంశెట్టి శ్రీనివాసరావు, బెల్లపుకొండ సతీష్, ఎస్.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్దనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్ఎస్ పీవో బి.రామకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్వీ నరసింహం,త్రినాథరాజు, కె.శివరామకృష్ణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వాల్మీకి జయంతి కార్యక్రమానికి డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కరరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయణాన్ని మహాకావ్యంగా లోకానికి పరిచయం చేసిన వాల్మీకి జీవితం నేటి సమాజానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సీపీవో ఎల్.అప్పలకొండ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.శశాంక, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ కేఎన్ జ్యోతి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి ముత్యాల సుబ్బారావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, బీసీ సంక్షేమ సంఘం, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


రచయిత దీక్షితుల సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న సన్నిధానం శాస్త్రి

రఘుదేవపురం జడ్పీ హైస్కూల్‌కు స్వచ్ఛ పాఠశాల అవార్డు


అవార్డు అందుకుంటున్న హెచ్‌ఎం శ్యామల

సీతానగరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ పాఠశాల అవార్డును మండలంలోని రఘుదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్యామలాదేవి కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. సోమవారం రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జిల్లా కలెక్టర్ చేకూరి కీర్తి అవార్డును అందజేశారు. జిల్లా స్థాయిలో 5 పాఠశాలలు ఎంపిక కాగా వాటిలో రఘుదేవపురం ఉన్నత పాఠశాల ఉండడం హర్షణీయమని పలువురు అభినందించారు.

అస్సాగో ఇథనాల్‌కు స్వచ్ఛ పరిశ్రమ అవార్డు


అవార్డు అందుకుంటున్న వివేక్‌కుమార్‌శుక్లా

గోకవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతతో పాటు, సామాజిక బాధ్యతతో కూడిన వివిధ అంశాల్లో విశేష కృషి చేసినందుకు మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమకు స్వచ్ఛ ఆంధ్ర అవార్డు వచ్చింది. రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ వివేక్ కుమార్‌శుక్లా, ఏఎస్‌వో భవానీ శంకర్, హెచ్ఎస్ఈ మేనేజర్ సూర్య, రాజ్ కుమార్, పీఆర్వోలు రాజేశ్వరి, నాగదేవి అందుకున్నారు.

అవినీతి రహిత వికసిత్ భారత్ లక్ష్యం

దివాన్‌చెరువు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): అవినీతిరహిత వికసిత్ భారత్ భారత్ లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అధికారి ఇ.రాంబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు దివాన్‌చెరువు శాఖ ఆధ్వర్యంలో పాలచర్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న విజిలెన్స్ కార్యక్రమాల్లో భాగంగా తమ బ్యాంక్ రాష్ట్రవ్యాప్తంగా మూడునెలల పాటు ఉద్యోగులకు, ఖాతాదారులకు, విద్యార్థులకు అవినీతికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీబీ రాజమహేంద్రవరం ఆర్ఎం జి.శ్రీనివాసరావు, బీఎం పీఎస్ రత్నకుమారి, బ్యాంకు శాఖాధికారి వి.రామారావు, మోరంపూడి మేనేజర్ సందీప్, హెచ్ఎం జీవీఎస్ఎస్ సీతారామయ్య, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కడియం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్ అన్నందేవుల చంటి అన్నారు. మంగళవారం మండలంలోని ఎంఆర్ పాలెంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం జరిగింది. రైతులతో కలిసి ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసాద్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి రామారావుచౌదరి, కడియం సొసైటీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని, పాతూరి రాజేష్, మర్రెడ్డి రమేష్, వనమాలి బాలాజీ, కర్రి చినబాబు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై విద్యార్థులకు పోటీలు

బిక్కవోలు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలలో మంగళవారం జీఎస్టీ 2.0పై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ పంపన సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రఘుదేవపురంలో అవగాహన ర్యాలీ

సీతానగరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘుదేవపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు శామలాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీ ద్వారా అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.అమ్మాజీ, జి.శేఖర్, ఎం.అప్పలరాజు పాల్గొన్నారు.

కోరుకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, బీమా ప్రీమియా వంటి అత్యవసర సేవలపై జీఎస్టీని రద్దు చేయడం ద్వారా ప్రజలందరికి మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రం పాక్షికంగా రెండంకెల వృద్ధిని సాధించడం ద్వారా 2047 నాటికి రాష్ట్రాల జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో గణనీయ పెరుగుదలను నమోదు చేయనుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయుల విజ్ఞాపన సభకు తరలండి

రంగంపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎంటీఎస్-1998 ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 11న విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే విజ్ఞాపన సభకు రాష్ట్రంలోని 1998 ఉపాధ్యాయులందరు హాజరై విజయవంతం చేయాలని సంఘం నాయకులు ముత్యాల శ్రీనివాసరావు, రమేష్‌నాయుడు, మోహన్‌రెడ్డి, ప్రకాష్ కోరారు. మంగళవారం రంగంపేటలో నిర్వహించిన 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంటీఎస్ ఉపాధ్యాయుల ఉపాధ్యాయులందరినీ రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయస్సు పెంచాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. విజయవాడలో జరిగే విజ్ఞాపన సభకు అందరూ తరలి రావాలని సంఘనాయకులు కోరారు.

పాము కాటుకు మందు అందుబాటులో ఉంది

రంగంపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పాముకాటు చికిత్సకు అవసరమైన యాంటీ స్నేక్ వెనమ్ (ఏఎస్‌వీ) రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉందని వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి మంగళవారం తెలిపారు. మండలంలోని ప్రజలు భయపడకుండా పాము కాటు వేసినప్పుడు ఇంటి వద్ద స్థానిక చికిత్సలు చేయకుండా వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకురావాలని ఆమె సూచించారు. సమయానికి వైద్య సహాయం పొందితే ప్రాణాపాయం తప్పించికోవచ్చని చెప్పారు. పాముకాటు ప్రాంతాన్ని గట్టిగా కట్టకూడదని, రక్తం పీల్చకూడదన్నారు. గాబరాపడకుండా సమయానికి వైద్యం పొందాలని చెప్పారు.

మార్కెట్లోకి మహీంద్రా కొత్త థార్


కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న సంస్థ డైరెక్టర్ శ్రీరామ్, తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రముఖ మహీంద్రా డీలర్ ఎంఅండ్ఎన్ మోటార్స్ మంగళవారం కొత్త థార్ (రీఫ్రెష్)ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎంఅండ్ఎన్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ శ్రీరామ్ మాట్లాడుతూ మోటార్స్ మెరుగైన కంఫర్ట్, స్మార్టు కనెక్టివిటీతో, బహుళ ట్రాన్స్‌మిషన్లతో జత చేయబడిన విభిన్న డ్రైవింగ్ ప్రాధాన్యతలకు అనుగుణంగా మహీంద్రా అనేక రకాలైన ఇంజన్ ఎంపికలను అందిస్తుందని అన్నారు. కొత్త థార్‌ను నూతన డిజైన్ అంశాలు, అధునాతన కంఫర్ట్ ఫీచర్లు, స్మార్టు టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జీఎం రాజా, సేల్స్ మేనేజర్లు, ప్రాసెస్ సిబ్బంది, కస్టమర్లు, ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ ఎగ్జిబిషన్‌లో రంగంపేట ప్రాజెక్ట్‌కు ప్రథమం


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారధి

రంగంపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం ఏసీటీ సైన్స్ సెంటర్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5న నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్, పోటీల్లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని బి.పూజిత రూపొందించిన 'జీరో వేస్ట్‌సిప్ సేవ్ ప్లానెట్' ప్రాజెక్టు జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిదని హెచ్‌ఎం వి.పార్థసారధి తెలిపారు. ఈ పోటీల్లో కాకినాడ, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల నుంచి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు 60కి పైగా సైన్స్ ప్రాజెక్టులు పోటీలో ప్రదర్శించారన్నారు. అలాగే సీనియర్స్ విభాగంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, ప్రాజెక్టులకు గైడ్‌గా వ్యవహరించిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధను హెచ్‌ఎంతోపాటు ఎంఈవోలు కె.శ్రీనివాసరావు,పి.మధుసూదనరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

డిమాండ్లు నెరవేర్చాలంటూ ఆశా వర్కర్ల ధర్నా

అనపర్తి అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం మండలంలోని రామవరం, కుతుకులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు అనూష మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అందించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, మృతిచెందిన సమయంలో దహన సంస్కారాలకు రూ.20 వేలు అందించాలని, నాణ్యమైన యూనిఫామ్ అందించాలని, టీఏ, డీఏలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మరియమ్మ, రాజకుమారి, స్వర్ణ, గంగాభవాని, పలివెల లలిత తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు క్లోజర్ బెనిఫిట్స్ అందజేయాలి: నల్లమిల్లి

బిక్కవోలు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం శివారు కానేడులోని బ్లూక్రాఫ్ట్ ఆగ్రో ఇండస్ట్రీస్‌ను యాజమాన్యం అర్ధాతరంగా మూసివేయడంతో కార్మికులకు క్లోజర్ బెనిఫిట్స్ పూర్తిగా అందలేదని అవి అందేలా చూడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి కాకినాడలోని డిప్యూటి కమిషనర్ ఆఫ్ లేబర్ వల్లీకి తెలిపారు. కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా 2023 నవంబరులో ఫ్యాక్టరీని మూతవేయడంతో 300 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. కార్మికులు అంగీకరించనప్పటికీ క్లోజర్ బెనిఫిట్స్ పేరుతో 15 రోజుల జీతం, గ్రాట్యుటీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసి యాజమాన్యం చేతులు దులుపుకుందన్నారు. దీనిపై వల్లీ సానుకూలంగా స్పందించి చర్చల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించండి

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల చట్టాలపై యూనివర్శిటీ విద్యార్థులకు అవగాహన కల్పించాలని నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రసన్నశ్రీని జిల్లా వినియోగాదారుల రక్షణమండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు కోరారు. నన్నయ యూనివర్శిటి వీసీ ప్రసన్నశ్రీని సోమవారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్శిటి పరిధిలో అన్ని కళాశాల్లో వినియోగదారుల చట్టాలపై అవగాహన సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనివర్శిటి రిజిస్ట్రార్ కేవీ స్వామి పాల్గొన్నారు.

18న చెకుముకి పరీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా అక్టోబరు 18న పాఠశాల స్థాయి పరీక్ష, నవంబరు 1న మండల, పట్టణస్థాయి పరీక్ష నిర్వహిస్తున్నామని, జిల్లాస్థాయి పరీక్ష నవంబరు 23న జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు కె.భీమయ్య తెలిపారు. ఈమేరకు మంగళవారం జనవిజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు-2025 పోస్టర్‌ను డీఈవో కె.వాసుదేవరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.మల్లికార్జునరావు, తాతాజీ, తోరాటి వసంతరావు, తాతారావు పాల్గొన్నారు.

ఆఫ్రికా నత్తల నుంచి తోటలను సంరక్షించుకోవాలి

అనపర్తిలో బొప్పాయి తోటలను పరిశీలించిన ఉద్యానవన శాఖ అధికారులు

అనపర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆఫ్రికా నుంచి వలస వచ్చిన నత్తలు ఆశించడం ద్వారా పండ్ల తోటల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వీటి నుంచి పంటను రక్షించుకునేందుకు జాగ్రత్తలు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి అల్లం నాగదేవిశ్రీ అన్నారు. మంగళవారం అనపర్తి శివారు కొత్తూరులో సత్తి గంగిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆఫ్రికా నత్తలు ఆశించిన బొప్పాయి తోటను అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా నత్తల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను వారు రైతులకు వివరించారు.నత్తలను ఒక్కొక్కటిగా సేకరించి ఐదు లీటర్ల నీటిలో కిలో ఉప్పును కలిపి ఆ నీటిలో వేస్తే సమగ్రంగా నివారించవచ్చని అన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే ఈ ద్రావణంలో ఒక లీటరు నీటికి మూడు గ్రాముల చిలెటెడ్ కాపర్, మూడు గ్రాముల చిలెటెడ్ ఐరన్ చెట్ల మీద పిచికారి చేయాలని సూచించారు.

టీడీపీ మాజీ కార్పొరేటర్ రామచంద్రరావు మృతి



రాజమహేంద్రవరం రూరల్/సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మాజీ కార్పొరేటర్ నేతల రామచంద్రరావు (75) అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా గుండె సంబంధిత ఇన్‌ఫెక్షన్స్‌తో బాధపడుతున్న ఆయన మంగళవారం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.రాజమహేంద్రవరం పురపాలక సంఘం నుంచి నగరపాలక సంస్థకు ఏర్పడ్డాక జరిగిన తొలి ఎన్నికల్లో తొలి పాలక మండలిలో ఆల్‌కట్ తోట ప్రాంతంలో 1వ వార్డు టీడీపీ కార్పొరేటర్‌గా రామచంద్రరావు ఎన్నికయ్యారు. దివంగత ఎంఎస్ చక్రవర్తి మేయర్‌గా ఉన్నపాలక మండలిలో కార్పొరేటర్‌గా పనిచేశారు. 2003 గోదావరి పుష్కరాలకు రామచంద్రరావు సేవలందించారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, డాక్టర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే పలువురు టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు సంతాపం ప్రకటించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: కిష్కింధపురి
సూర్యమినీ	: అవతార్, సన్నీ సంస్కారికి తులసీకుమారి
సూర్యప్యాలస్	: కాంతారా-1
స్వామి	: ఓజీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఓజీ
శివజ్యోతి	: ఓజీ
రాజా	: ఓజీ
ఊర్వశి	: కాంతారా-1
మేనక	: ఇడ్లీ కొట్టు
రంభ	: మిరాయ్
అప్సర	: కాంతారా-1
అశోక	: ఇడ్లీ కొట్టు
వీఎస్ మహల్(నామవరం)	: మిరాయ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కాంతారా-1, ఓజీ
వెంకటసూర్య(కడియం)	: ఓజీ
సత్యగౌరి (అనపర్తి)	: ఓజీ
సూర్యశ్రీ (అనపర్తి)	: కాంతారా-1
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కాంతారా-1, ఓజీ
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కాంతారా-1
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓజీ
లలితామహాల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు



వైద్యంపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి కథనంతో కలెక్టర్ కీర్తి చేకూరి కదిలారు. రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవల నాణ్యతపై ఆరా తీశారు. పలు వార్డులు తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. టీబీ విభాగం పనితీరుపై ఆరా తీశారు. మందుల నిల్వలు, ల్యాబ్ పరీక్షల తీరుతెన్నులు, ఓపీ రిజిస్ట్రేషన్ తదితర వివరాలు తెలుసుకున్నారు. రోగులకు వైద్యసేవలందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. వైద్య పరీక్షలకు బయటకు వెళ్లే పరిస్థితి రాకూడదని, అన్ని సౌకర్యాలు ప్రభుత్వాసుపత్రిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఖాళీగా ఉన్న వైద్యాధికారులు పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుబ్బారావు, వైద్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో మంగళవారం పున్నమి హారతి ఇచ్చారు. పౌర్ణమి సందర్భంగా గోదావరి మాతకు హారతిచ్చినట్టు అర్చకులు తెలిపారు. ఆ హారతి చూద్దామని ఎక్కడో మహారాష్ట్ర నుంచి వచ్చిన యాత్రికులకు కనీసం అవకాశం కల్పించలేదు. దీంతో గేటు వద్ద నిలబడి ఇలా తిలకించారు.
- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



వైద్య సిబ్బందితో కలిసి జిల్లా ఆసుపత్రి ఆవరణ పరిశీలించి ల్యాబ్‌ను తనిఖీ చేసి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ కీర్తి చేకూరి

సారాజ్యమే!

జిల్లాలో సారా కోరలు



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సారా యథేచ్ఛగా తయారవుతోంది.. విచ్చల విడిగా లభ్యమవుతోంది.. అయినా అధికారులు చూస్తూ ఊరుకోవడం తప్ప ఏం చేయలేకపోతున్నారు. ఎక్కడ ఏం జరుగుతుందో ఎక్సయిజ్ సిబ్బందికి తెలిసినా మామూళ్ల మత్తులో జోగు తూ కళ్లు మూసుకుంటున్నారు. టార్గెట్ల మేరకు కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం నిర్వహించిన సమీక్షలో కూడా ఎక్సయిజ్ అధికారులు జిల్లాలో 1029 సారా కేసులు నమోదు చేసి 1079 మందిని రిమాండ్‌కు పంపామని చెప్పడం గమనార్హం. అంతే కాకుండా 13,500 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 3,97,240 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు చెప్పారు.40,324 కేజీల బెల్లం స్వాధీ నం చేసుకుని 19 మంది బెల్లం విక్రయ దా రులపై కేసులు నమోదు చేశామన్నారు. సారా తయారీ కాస్త తగ్గినట్టు కనిపించినా..ఇంకా కొనసాగుతూనే ఉంది.

నైవోదయం

సారా తయారీ దారులు, విక్రయదారులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించడం ద్వారా శాశ్వతంగా సారా తయారీకి దూరం చేయాలనేది నవోదయం 2.0 ముఖ్యోద్దేశం. కానీ కేసులు బనాయిస్తున్నామని గర్వంగా ప్రకటిస్తున్న ఎక్సైజ్ శాఖ.. ఎంత మంది జీవితాల్లో నవోదయం తీసుకొచ్చిందో చెప్పలేని స్థితిలో ఉండడం గమనార్హం.

కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టినా..

కూటమి ప్రభుత్వం సారా మహమ్మారిని నిర్మూలించాలని గట్టిగా నిర్ణయించుకొంది. సారా నిర్మూలనే ధ్యేయంగా నవోదయం 2.0 పేరుతో ఎక్సయిజ్ శాఖలో ఒక విభాగాన్నే ఏర్పాటు చేశారు. ఎక్సయిజ్, పోలీసుల ఉదాసీనత ప్రభుత్వ ఉద్దేశాన్ని వెనక్కు నెడుతోంది. దీంతో జిల్లాలో సారా ఏరులై పారుతోంది. ఎక్కడో గ్రామాల్లో దొరికే నాటు సారా ఇప్పుడు సిటీల్లో కూడా పూటుగా లభ్యమవుతోంది. దీంతో నవోదయం 2.0 నీరుగారిపోతుండగా.. ఎక్సైజ్ అధికారులు నవోదయం అర్థాన్నే మార్చేసి కేసు లతో సంబుర పడుతున్నారు. ఎక్సయిజ్, పోలీస్ శాఖలోని ఇంటి దొంగలు వారాల మామ్మూళ్లు పెట్టుకోవడంతో కేసులు తప్ప సారా వ్యాపారుల జీవితాల్లో మంచి మార్పు లేకుండా పోయింది. పోలీస్ శాఖ పూర్తిగా కాడి వదిలేసి చోద్యం చూస్తుండడం కొసమెరుపు. సారా నిర్మూలనకు గట్టిగా పట్టుపడుతున్నామని అధికారులు చెబుతుండడం తప్ప చర్యలు శూన్యం.

సారా తయారయ్యేదిక్కడే!

జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలో సారా లభ్యత పెరిగింది. దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు సమీప ప్రాంతాలు, వెలుగుబంద, శ్రీరాం పురం,దివాన్‌చెరువు, కానవరం, రఘునాథపురం, పుణ్యక్షేత్రం, శ్రీకృష్ణపట్నం, చక్రద్వారబంధం, గోకవరం మండలం తిరుమలాయపాలెం, మల్ల వరం, కామరాజుపేట, గంగంపాలెం, రంప ఎర్రంపాలెం తదితర ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలు ఉన్నాయి. గోపాలపురం మండలం బీ మోలు, సాగిపాడు, చాగల్లు మండలం చిక్కాల, దేవరపల్లి మండలం లక్ష్మీపురం, తాళ్లపూడి మం డలం తుపాకులగూడెం, నల్లజర్ల తదితర ప్రాం తాల్లో సారా ఇబ్బడిముబ్బడిగా తయారు చేస్తు న్నారు.రాజమహేంద్రవరంలో సీతంపేట, అప్సర థియేటర్ శ్యామలాంబ గుడి ఏరియా, నారాయ ణపురం వాంబే కాలనీ, ఆవ వాంబే కాలనీ, ధవ ళేశ్వరం ఐవోసీఎల్ కాలనీ, కాతేరు, ఆనంద్‌నగర్, క్వారీ మార్కెట్ ఏరియా, సంతోష్ నగర్, కొంత మూరు శివారు, సుబ్బారావునగర్, సీటీఆర్ఐ పనసచెట్టు ఏరియా, లాలాచెరువు లోపల ప్రాం తాల్లో, రైల్వేస్టేషన్ ప్రాంతం తదితర చోట్ల సారా లభ్యమవుతోంది. గతంలో వెంకటనగరం సారా తయారీకి అడ్డాగా ఉండేది. కానీ తర్వాత తయా రీదారుల్లో అంతర్గత గొడవల వల్ల కేసుల్లో ఇరుక్కోవడంతో తయారీ తగ్గింది.బయట ప్రాం తాల నుంచి వచ్చిన వాళ్లు బ్యాచీలుగా తయార య్యారు. వెంకట నగరం దాటి ఎగువ లంకల్లో సీతానగరం వరకూ సారా కాస్తున్నారు. వరద ల్లో మునగనిలంకలు సారా తయారీకి అడ్డాగా మారిపోయాయి.

పెద్ద సార్లు ఉన్నా..

నవోదయం 2.0కి అమలుకు అసిస్టెంట్ కమి షనర్ స్థాయి అధికారిని జిల్లాలో ప్రభుత్వం నియమించింది. కొందరు సీఐలనూ ప్రత్యేకించారు. సిబ్బందిని నియమించారు. కానీ ఎవరికి వారు యథాలాపంగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో నవోదయం ఉద్దేశం నిర్వీర్యమ వుతోంది. జిల్లాలో 19 మండలాల్లో 19 మండల స్థాయి కమిటీలను , 240 గ్రామస్థాయి కమిటీలను నియమిం చామని, 313 అవగా హన సదస్సులు నిర్వహిం చామని, 63 మంది దత్తత అధికారులు ఉన్నా రని ఎక్సైజ్ వారు వల్లెవేస్తున్నారు. కానీ వాస్తవ పరిస్థితుల్లో ఏ మేరకు మార్పు వచ్చిందో గమనిస్తే రాజమహేంద్రవరం నగరంలో సైతం ఏ సమయంలోనైనా సారా బాటిల్ దొరికే స్థా యికి పరిస్థితి చేజారింది. కొన్ని ప్రాంతాల్లో అధికారులను సైతం బెదిరించే స్థాయికి తయారీ, విక్రయదారులు చేరుకున్నారు.

వారం..వారం మామూళ్లు..

సారా దుకాణాల వాళ్లు ఎక్సైజ్, పోలీసులకు గతంలో నెలవారీ మామ్మూళ్లు ఇవ్వడం పరి పాటిగా ఉండేది. కానీ ఇప్పుడు వారాంతపు పేమెంట్లు పెట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సారా తయారీ దారులు ఎక్కడికి సరుకును సరఫరా చేస్తున్నారో డిపార్ట్‌మెంటు వారికి చెబితే వీరు వెళ్లి డబ్బులు వసూలు చేసుకుంటు న్నారని సమాచా రం. అందువల్ల ఆకస్మిక, సాధారణ దాడుల విషయం ముందుగానే కొందరు ఇంటి దొంగలు ఉప్పందిస్తుండడంతో సారా తయారీ, విక్రయదారులు అప్పటికి తాత్కాలికంగా సర్దుకుంటున్నారు. ఒకప్పుడు పెద్ద డ్రమ్ములు, ఎరువులు (పిండి), బెల్లం వంటి వాటిపై నిఘా ఉండేది. పెద్ద సంఖ్యలో ఎవరైనా కొనుగోలు చేస్తే ఎక్సయిజ్‌కి సమాచారం వెళ్లేది. కానీ ఇప్పుడు డబ్బుల మత్తులో అవన్నీ పక్కకుపోయాయి.

- యథేచ్ఛగా తయారీ..అమ్మకాలు
- మారుమూల ప్రాంతాలే కేంద్రాలు
- పలు గ్రామాల్లో కుటీర పరిశ్రమ
- కమిటీలు అంటున్న ఎక్సయిజ్
- చోద్యం చూస్తున్న పోలీస్
- సిబ్బందికి వారం మామూళ్లు
- తనిఖీల సమాచారం చేరవేత
- నెరవేరని నవోదయం లక్ష్యం

ప్యాకెట్లలో సారా

సారా వ్యాపారులు మారారు.. గతంలో సారా ప్యాకెట్లలో అమ్మకం జరిగేది. ఇప్పుడు 5, 10 లీటర్ల పెద్ద కవర్లలో సారా తీసుకొచ్చి దుకాణా లకు చేరుస్తున్నారు. అక్కడ పావు, అర, లీటరు బాటిళ్లలో నింపి అమ్మకాలు జరుపుతున్నారు. గతంలో పుల్లల పొయ్యి పెట్టి ఆ బట్టీల్లో సారా కాయడం జరిగేది. ఇప్పుడు గ్యాస్ సిలిండర్లను.. స్టవ్‌లను వినియోగించి సారా కాస్తున్నారు.

సమాచారం ఉంటే డయల్ 14405



సారా నిర్మూలనకు చర్యలు చేపడుతున్నాం.ఎక్కడ ఎవరు సారా తయారు చేసినా,అమ్మినా, రవాణా చేసినా 14405కు కాల్ చేసి ఫిర్యాదు చేయా లి.ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంటాయి. - **కీర్తి చేకూరి, కలెక్టర్**






నరేంద్రపురం - నందరాడ గ్రామాల మధ్య జరిగిన ప్రమాదంలో మృతులు

రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని

ఇద్దరి దుర్మరణం

- ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు
- నరేంద్రపురం వద్ద ఘటన
- ఒకరిది కొవ్వూరు
- మరొకరిది రాజానగరం
- రెండు కుటుంబాల్లో విషాదం

రాజానగరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం-నందరాడ గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజానగరంలోని సుబ్బారావు కాలనీకి చెందిన బుదిరెడ్డి సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు (32) జట్టు కూలీగా పనిచేస్తున్నాడు. భార్య మంగ ఆశా వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. సత్తిబాబు, మంగ రాజానగరంలోని ఒక దుకాణంలో పనిచేసిన సమయంలో ఏర్పడిన పరిచయంతో పదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్తిబాబు మోటార్‌సైకిల్‌పై కోరుకొండ వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో నందరాడ దాటిన తర్వాత మలుపులో మరో మోటార్‌సైకిల్‌పై ఎదురుగా వస్తున్న కొవ్వూరు మెరకవీధి 23వ వార్డుకు చెందిన మెర్ల శ్రీనివాస్ (45) బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇద్దరి తలలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. శ్రీనివాస్ కొవ్వూరు అవంతి ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. భార్య ఉంది.. పిల్లలు లేరు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరి కుటుంబాల్లో ఇంటి యజమానులు మరణించడంతో విషాదం అలుముకుంది. కుటుంబీకులు, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాజానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మోటార్ సైకిల్

ఆర్టీసీ దసరా ఆదాయం రూ.40 లక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : దసరా పండుగ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఆర్టీసీ రూ.40 లక్షల ఆదాయం ఆర్జించింది. మొత్తం 194 బస్సులను వివిధ ప్రాంతాలకు ఆపరేట్ చేయడం ద్వారా ఈ ఆదాయం లభించిందని జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. గోకవరం డిపో నుంచి 34 బస్సులు, కొవ్వూరు డిపో నుంచి 37 బస్సులు, నిడదవోలు డిపో నుంచి 19 బస్సులు, రాజమహేంద్రవరం డిపో నుంచి 104 బస్సులు నడపడం జరిగిందని తెలిపారు. మొత్తం 28,712 మంది ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చడం జరిగిందని, 92 శాతం ఓఆర్ సాధించామని తెలిపారు. స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమల్లో ఉండగానే జిల్లా ఆర్టీసీ ఇంత భారీ స్థాయిలో ఆదాయం సాధించిందన్నారు. అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని అభినందిస్తున్నామన్నారు.



ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో టీడీపీ నాయకులు, పేపరుమిల్లు యూనియన్ కార్మికులు

పేపరుమిల్లు కార్మికులకు న్యాయం చేశాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆంధ్ర ప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులకు వేతన ఒప్పందం అమలు కూటమి ప్రభుత్వ విజయమేనని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. నూతన వేతన ఒప్పందం కుదిరిన నేపథ్యంలో మిల్లు కార్మిక యూనియన్ నాయకులు మంగళవారం తిలక్ రోడ్డులో కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు.గత వైసీపీ ప్రభుత్వంలో ప్యాకేజీపై ఉన్న శ్రద్ధ కార్మికుల వేతన ఒప్పందంపై చూపించలేదన్నారు. కార్మికుల సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో న్యాయం జరిగేలా మంచి అగ్రిమెంట్ చేయించగలిగామన్నారు. అనంతరం పేపరుమిల్లు కార్మిక నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లకు పైబడి అగ్రిమెంట్ లేక చాలా బాధలు పడ్డామన్నారు. ఎమ్మెల్యే వాసు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్‌లు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అగ్రిమెంట్ చేయించారన్నారు. విజయవాడలో జరిగిన అగ్రిమెంట్‌లో కార్మికులకు రూ.5,800 చొప్పున, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.2,200 చొప్పున జీతం పెంచారని తెలిపారు. మంచి అగ్రిమెంట్ చేసి 4 వేల మంది కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.ఏలూరులో అగ్రిమెంట్ కాపీ ఇచ్చారని దీనిపై 11 యూనియన్లు సంతకాలు పెట్టాయని తెలిపారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు,వర్రే శ్రీనివాసరావు, పేపరు మిల్లు కార్మిక నాయకులు పాల్గొన్నారు.





అన్నదాతకు..

ధర కోత!

వరి కోతలు ఆరంభంలోనే అష్టకష్టాలు

- మెట్టలో చేతికొస్తున్న పంట
- ఐదు రోజులుగా కోతలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లేవ్
- 11 నుంచి ప్రారంభం
- దళారులకు అమ్మకాలు
- బస్తాకు రూ.370 నష్టం
- ముందస్తు సాగు ఎఫెక్ట్

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ ముందస్తు సాగుకు అధికారులు చేపట్టిన చర్యలు ఫలించాయి. అప్పుడే వరి కోతలు ఆరంభమైపోయాయి.రైతులు సన్నాల రకం పండిం చాలంటూ అధికారులు ప్రోత్సహించడంతో రైతులు అదేరకం పండించారు. అయితే వాతావరణ ప్రభావం, మరో వైపు వరిపంట కోతకు రావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తప్పని పరిస్థితుల్లో కోతలు కోస్తున్న రైతులు దళారులకే అమ్ము కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిట్టుబాటు కాక రైతులు లబోదిబోమంటున్నారు. ధాన్యం కొను గోలు కేంద్రాలు ఏర్పాటుకు డిమాండ్ చేస్తున్నారు.

81,971 హెక్టార్లలో సాగు

జిల్లాలో 80,971 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. పంటకాలువల ద్వారా 38,100, బోర్‌వెల్స్ ద్వారా 41,117, వర్షాధారం 1700 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కొవ్వూరు, నిడదవోలు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో రైతుల బోర్ల కింద వరి సాగు చేస్తారు.దీంతో సుమారు 15 రోజుల ముం దుగానే పంట చేతికొస్తుంది. ఈ పరిధిలో రైతులు ఎక్కువ శాతం ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాకుండా దళారుల ద్వారా మిల్లర్లకు విక్రయిస్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే సరికే మూడొంతుల పంట అమ్మకాలు జరిగిపోతాయి. ఆయా ప్రాంతాల్లో ముందస్తుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

బస్తా రూ.1400లే

గత ఐదు రోజులుగా కోత లు కోస్తున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ కేంద్రాల ద్వారా గ్రేడ్ ఏ రకం 75 కేజీల బస్తా రూ.1791.75, కామన్ రకం రూ.1776.75 కొను గోలు చేస్తామని ప్రభుత్వం చెబుతుంది.అయితే బోర్ల కింద వేసిన పంట కోతలకు రావడం, నిల్వ చేసు కునేందుకు అనుకూల పరిస్థితులు లేకపోవ డంతో వెరసి దళారులకు వరంగా మా రింది. దీంతో దళారులు అడిగిన ధరకే అమ్ము కోవాల్సి వస్తోంది. గతేడాది ఇదే సమయానికి ధాన్యం బస్తా(75 కేజీలు) అదే దళారుల (ప్రైవేటు మిల్లర్లు) రూ.1600 నుంచి రూ.1700 ల వరకు కొనుగోలు చేశారు.ప్రస్తుతం రైతుల పరిస్థి తుల ను అసరాగా తీసుకొని రూ.1400 కే కొను గోలు చేసి దళారులు సొమ్ములు చేసుకుం టున్నారు. గత సీజను కంటే ప్రస్తుత సీజన్‌లో కాంప్లెక్స్ ఎరువులు సుమారు రూ.200 నుంచి రూ. 250 వరకు పెరిగాయని దీంతో తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే

సహించొద్దు

జిల్లా నేర సమీక్షలో ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశం

రాజమహేంద్రవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సాధారణ జన జీవనానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించవద్దని ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సర్కిళ్ల వారీగా కేసులపై ఆరా తీశారు. దీపావళి పండుగను పురస్కరించుకుని ఎలాంటి దుర్ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, అసాంఘిక వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ఓపెన్ డ్రింకింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లపై తనిఖీలు, రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. అనుమానితుల వేలి ముద్రలను ఎంఎస్‌డీ డివైజ్‌తో చెక్ చేయాలన్నారు. ప్రతి కేసులో సాంకేతిక ఆధారాలు సేకరించడంతో పాటు అందుబాటులో ఉన్న ఆధునిక పద్ధతుల్లో దర్యాప్తులు చేయాలని చెప్పారు. జిల్లాలోని బ్లాక్ స్పాట్లలో డ్రోన్‌లతో పర్యవేక్షణ చేయాలన్నారు.అనంతరం సేఫ్ దీపావళి పోస్టర్లు విడుదల చేశారు. గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ఎన్ బీఎం.మురళీ కృష్ణ,ఏవీ సుబ్బరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాలేజ్ బస్ ఆపించి.. కాలువలో దూకేసిన ఇంటర్ విద్యార్థిని..
తాళ్లపూడి మండలంలో యథేచ్ఛగా యర్రమట్టి తవ్వకాలు
నేడు నల్లజర్ల జడ్పీ హైస్కూల్‌లో మెగా జాబ్ మేళా
8

గో..దారేది!

వరద తగ్గినా.. తెరుచుకోని ఘాట్లు





గోష్పాదక్షేత్రం వద్ద తొలగించని తెరలు

ఘాట్ లోపలికి వెళ్లకుండా కట్టిన టార్పాలిన్

అపరిశుభ్రంగా ఉన్న ఘాట్లు





ఘాట్‌ను శుభ్రం చేస్తున్న కార్మికులు



ఖాళీగా దర్శనమిస్తున్న జల్లు స్నానం ఘాట్



శివలింగం వద్ద భక్తుల స్నానాలు

గోదావరి వరద తగ్గింది.. అయినప్పటికీ నేటికీ ఘాట్లు తెరుచుకోలేదు.. బంద్ చేసే ఉన్నాయి.. దీంతో భక్తులు, సందర్శకులు, తదితరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదం జరిగిందని 10 రోజుల కిందట గోదావరి పరీవాహక ప్రాంతంలోని అన్ని ఘాట్లు మూసేశారు.. ఎవరినీలోనికి అడుగు పెట్టనీయడం లేదు. అయితే ఘాట్ల వద్ద రక్షణ చర్యలు మాత్రం చేపట్టడం లేదు.. మళ్లీ వరదొస్తే మళ్లీ మూసేయడం తప్ప శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. ఇటు రాజమహేంద్రవరం, అటు కొవ్వూరు వైపు అంతే. ప్రస్తుతం అయ్యప్ప, భవానీ, వెంకటేశ్వరస్వామి మాలధారులు గోదావరి స్నానానికి ఎక్కువగా వస్తుంటారు. ఘాట్లు మూసి వేసి ఉండడంలో నిట్టూర్చుతున్నారు. మరో వైపు మెట్లపై మట్టి పేరుకు పోయింది. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. విజయ వాడ కృష్ణానదిలో మెట్ల వద్ద సిమెంట్ మెస్ అడ్డుగా ఉంటుంది. దీంతో అక్కడ నీట మునిగిన ప్రమాదాలు చాలా అరుదు. ఆ దిశగా గదావరి మన ఘాట్ల వద్ద కూడా అలా ఏర్పాటు చేస్తే వరదొచ్చినా ఇబ్బంది ఉండదని భక్తులు అంటున్నారు.. ఆ దిశగా అధికారులు ఆలోచించాల్సి ఉంది.

- కొవ్వూరు

పందలపాకలో జీఎస్టీ 2.0 పై పోటీలు

బిక్కవోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పందల పాక ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళ వారం జీఎస్టీ 2.0పై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఎంపీడీవో వీ.శ్రీనివాస్, ఎంఈవో సీహెచ్‌వీవీ సత్య నారాయణ బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ పంపన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాభివృద్ధికి రూ. 5 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాత శివశంకర్ దంపతులు, వారి కుమార్తెలు

దేవరపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి దేవరపల్లికి చెందిన తంగెళ్ల శివశంకర్, సత్యవాణి దంపతులు రూ.5లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో తంగెళ్ల శివశంకర్ సత్యవాణి దంపతులు కుమార్తెలు డోలాశ్రీ రమ్య, డోలా శ్రీలహరి, కుమారుడు వెంకట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివ శంకర్ దంపతులకు ఆలయ ప్రధాన అర్చ కులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు వేదాశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కడియాల

పెరవలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ముక్కామల శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కడియాల సాయి రామారావు ఎన్నికయ్యారు. కమిటీ ఏర్పాటు నిమిత్తం మంగళవారం గ్రంథాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుల తోపాటు ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మోటుపల్లి శ్రీరామ్మూర్తి, సెక్రటరీగా సలాది వీర వెంకట సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా కరటుటూరి విశ్వనాథం, ట్రెజరర్‌గా ఎం. వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా పది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి యత్నం దుర్మార్గం

కొవ్వూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి ప్రయత్నించి, అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై సనాతన ధర్మం పేరుతో దాడి చేయాలని యత్నించడం సరికాదన్నారు. ప్రపంచ దేశాలన్నీ శాస్త్ర, సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతుంటే, దేశ సమైఖ్యతను దెబ్బతీసే ఇలాంటి దుశ్చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీహెచ్‌సీల్లో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి

● వైద్యాధికారి సాంబశివరావు

కొవ్వూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : దొమ్మేరు పీహెచ్‌సీలో కుక్క, పాముకాటుకు సంబంధించి వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని ఆ పీహెచ్‌సీ వైద్యాధికారి డీ.సాంబశివరావు తెలిపారు. కుక్కకాటు (ఏఆర్‌వీ), పాముకాటు (ఏఎస్‌వీ) ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలైన దొమ్మేరు, సావరం, పెనకనమెట్ట ఆరికిరేవుల, నందమూరు, వేములూరు, పశివేదల, వాడపల్లి బంగారంపేట ప్రజలు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

నిడదవోలు: గ్రామీణ ప్రాంతాల్లో పాము, కుక్క కాటు బారిన పడిన వారికి తాడిమళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ తాళ్లూరి ఆంద్రే తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

బస్సు ఆపమని ... కాలువలో దూకిన ఇంటర్ విద్యార్థిని

● పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం ముమ్మర గాలింపు చర్యలు

● లభ్యం కాని ఆచూకీ

ఉండ్రాజవరం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్త గ్రామానికి చెందిన జూనియర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థిని మంగళవారం సాయంత్రం దమ్మెన్ను కాలువలోకి దూకేసింది. గ్రామానికి చెందిన కొప్పుల పూజిత మండలంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఉదయం యథావిధిగా కాలేజీకి వెళ్లి తిరిగి బస్సులో సాయంత్రం ఇంటికి వస్తుండగా దమ్మెన్ను కాలువ వంతెనపైకి రాగానే తనకు వాంతులు అవుతున్నాయని, బస్సును ఆపమని డ్రైవర్‌కు చెప్పి దిగిన వెంటనే ఒక్కసారిగా వంతెనపై నుంచి కాలువలోకి దూకేసింది. దీంతో తోటి విద్యార్థి తమ కళ్లెదుటే కాలువలోకి దూకేయడంతో విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే స్థానికులు రక్షిద్దామని ప్రయత్నించినప్పటికీ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అందులో కొట్టుకుపోయింది. సంఘటన తెలిసిన వెంటనే ఉండ్రాజవరం పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం గాలింపు చేపట్టారు. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈమె తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, సుబ్బలక్ష్మి విడాకులు తీసుకుని వేర్వేరుగా జీవిస్తున్నారు. పూజితకు అక్క, అన్నయ్య ఉన్నారు. మోర్తలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటోంది. విషయం తెలుసుకున్న డీఎస్పీ దేవకుమార్, నిడదవోలు సీఐ తిలక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

పేదలకు అత్యాధునిక వైద్యం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



పట్టణంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఇతర నాయకులు

కొవ్వూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 12 మందికి రూ. 5,70,693 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. వాడపల్లి, తోగుమ్మి, వేములూరు, కాపవరం, పంగిడి, సీతంపేట, ఆరికిరేవుల, ధర్మవరం గ్రామాలకు చెందినవారు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకార్ల నారాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్జిల్లి రామకృష్ణ, ఎరుబండి వెంకట్రావు, వరిగేటి కాంతరాజు, సుంకర సత్తిబాబు, వేమగిరి వెంకట్రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ జీఎస్టీ'పై అవగాహన

పేద, మధ్య తరగతి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా జీఎస్టీలో సంస్కరణలు చేశారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరుటౌన్‌లోని 13వ వార్డు దగ్గువారివీధిలో మంగళవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్టీ తగ్గింపుపై ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందిస్తూ అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధి గురించి వివరించారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు రూ. 15 వేలు వరకు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బొబ్బిలి పేర్రాజు, కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ, తవ్వా హరిబాబు, నాగళ్ల వినయ్, గాయత్రి, రాజీ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు తరలి రండి : ఎమ్మెల్యే



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

నల్లజర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల జడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగే మెగా జాబ్‌మేళాకు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు తరలిరావాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పిలుపునిచ్చారు. మంగళవారం హైస్కూల్‌లో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చిన అభ్యర్థులకు అన్ని రకాల సదుపాయాలు, అక్కడే రిజిస్టర్ చేసుకునే అవకాశం కల్పించాలన్నారు. అలాగే తాగునీరు, వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల సూచించారు. ఆయన వెంట గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్ధనపూడి బ్రహ్మరాజు, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

పోతవరం గ్రామానికి చెందిన బాదంపూడి రవి కుమార్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆయన కుటుంబానికి అండగా ఉం డాలని గ్రామ పెద్దలు, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు విద్యుత్ అధికారులతో మాట్లాడి కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. మంగళవారం విద్యుత్‌శాఖ నుంచి చెక్కు రావడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి రవికుమార్ భార్య శిరీషకు చెక్కును అందించారు. కార్య క్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, మాజీ మండలాధ్యక్షుడు ఏలేటి సత్యనారాయణ (జేడీ) మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్, సొసైటీ అధ్యక్షుడు పసుమర్తి ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గులాబీపూల అలంకరణలో అమ్మవారు



బాలాత్రిపుర సుందరి అమ్మవారు

కొవ్వూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని విశేష కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని గులాబీ పువ్వులతో అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లలితా సహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెరవలి: దేవీ నవరాత్రుల్లో భాగంగా మంగళవారం తీపర్రులో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాండ్ మేళం, వివిధ రకాల వాయిద్యాలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.

చాగల్లు: మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా ముగిశాయి. శివాలయం పక్కన గల ముత్యాలమ్మవారి ఆలయ సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద మండపాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు



ధర్నా చౌక్‌లో నినాదాలు చేస్తున్న జిల్లా ఉపాధ్యాయులు

తాళ్లపూడి అక్టోబరు 7 (ఆంధ్రజోతి) : ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మంగళవారం అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌ల భారం తొలగించి విద్యార్థులకు భోదించే సమయం ఇవ్వాలని, అలాగే 12 వ పీఆర్‌సీ నియమించి 30 శాతం మధ్యంతర భృతి కల్పించాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా ... ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి పెట్టకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. ధర్నాలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారని ఓ ప్రకటనలో దుర్గారావు తెలిపారు.

ఆశా వర్కర్ల నిరసన



తాళ్లపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

తాళ్లపూడి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం తాళ్లపూడి, మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద నిరసన చేపట్టింది. అనంతరం వినతిపత్రాలు అందించారు. తాళ్లపూడి పీహెచ్‌సీ వద్ద ఏపీ రాఘవ, కే. సుధారాణి ఆధ్వర్యంలో మలకపల్లి పీహెచ్‌సీ వద్ద జీ. బేబికుమారి ఆధ్వర్యంలో నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందర్ బాబు, జిల్లా కోశాధికారి జీ. బేబీకుమారి మాట్లాడుతూ ఆశావర్కర్లు గత 20 సంవత్సరాలుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. పెరుగుతున్న పనిభారంతో పాటు వచ్చే వేతనంలో ఎక్కువ భాగం విధి నిర్వహణకే ఖర్చు అవుతోందని, చాలీచాలని వేతనాలతో ఆశావర్కర్లు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేతనాలు పెంచుతా మని, తీరా వచ్చి 17 మాసాలైనా హామీలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాకవి వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ గీతాంజలి, తదితరులు

నిడదవోలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సంస్కృత భాషలో ఎంతో సాహిత్య సేవ చేసిన మహాకవి వాల్మీకి అని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీ. గీతాంజలి కొనియాడారు. మంగళ వారం పట్టణంలోని కళాశాలలో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి సంస్కృతంలో రామాయణం రచించారన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల ద్వారా అవగాహన కల్పించారు. అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు దేవరపల్లిలో క్రీడా పోటీలు

దేవరపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాల క్రీడాకారులకు స్థానిక అంబటి సత్యనారాయణరావు జడ్పీ హై స్కూల్ లో బుధవారం కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్, యోగా, చెస్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో తిరుమలదాసు తెలిపారు. ఈ సందర్భంగా మండల పాఠశాల క్రీడల కన్వీనర్ ఆచంట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అండర్ 14,17 బాలబాలికలకు క్రీడలు నిర్వహించి, వారిని జిల్లా స్థాయి జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు దేవరపల్లి హైస్కూల్ గ్రౌండ్ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

యథేచ్ఛగా ఎర్ర మట్టి తవ్వకాలు

● పట్టించుకోని అధికారులు



పొక్లెయిన్‌తో మట్టిని తవ్వుతున్న దృశ్యం

తాళ్లపూడి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల ఎర్ర మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సాధార ణంగా నల్ల లేదా ఎర్రమట్టి తవ్వి తరలించడానికి కొన్ని నిబంధనలు పాటించి అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ మండలంలో మట్టి, ఇసుక ఈ రెండింటి మీదా అధికారుల నియంత్రణ ఏ మాత్రం లేదన్నది నగ్న సత్యం. మండలంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు వెంబడి మట్టిని తరలించేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతుండగా రాగోలపల్లిలో ఎత్తైన కొండను మిషన్లతో తవ్వేస్తున్నారన్నారు. అలాగే కలపను కూడా భారీగా తరలించేస్తున్నట్టు ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఎస్సీలు ఆరోపిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులైనా పట్టించుకుని తగు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు.